మంగళవారం 28.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 191 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

కర్నూలు బస్సు ప్రమాదం రాష్ట్రాన్ని కలిచివేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. మంత్రులు ఘటన స్థలానికి చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వ సహాయం కొనసాగుతుండగా, వైసీపీ మాత్రం నీచ రాజకీయాలు చేస్తూ శవ రాజకీయాలకు దిగింది.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి... ప్రాణ నష్టం జరగకూడదు

- విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు
- మొంథా తుఫాన్‌పై ప్రతీ గంటకూ బులిటెన్... రియల్ టైమ్‌లో అప్డేట్స్
- ఆస్తి-ప్రాణ నష్టం నుంచి రక్షించడమే ప్రభుత్వ లక్ష్యం
- నిరంతర సమాచారానికి శాటిలైట్ ఫోన్లు, మొబైల్ టవర్ల ఏర్పాటు
- పునరావాస కేంద్రాల్లోని వారికి నిత్యావసరాల పంపిణీ
- సమీక్షలో అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- తుఫాన్‌పై ముఖ్యమంత్రితో ఫోన్లో మాట్లాడిన ప్రధాని నరేంద్రమోదీ
- రాష్ట్రానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా
- పీఎంవోతో సమన్వయ బాధ్యతలు మంత్రి లోకేష్‌కు అప్పగించిన సీఎం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ప్రభావాన్ని, నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరేలా రియల్ టైమ్‌లో సమాచారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ప్రతీ గంటకూ తుఫాన్ బులిటెన్లు విడుదల చేస్తూ, అప్రమత్తం చేయాలని సూచించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మొంథా తుఫాన్ కారణంగా నెలకొన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎక్కడా సమాచార పంపిణీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని చెప్పారు. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు శాటిలైట్ ఫోన్లు వినియోగించాలని, మొబైల్ టవర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం ఎక్కువ ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3,211 జెనరేటర్లను పవర్ బ్యాకప్ కోసం వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎక్కడా కమ్యూనికేషన్ వ్యవస్థకు అవాంతరాలు తలెత్తకూడదన్నారు. తుఫాన్ వల్ల ఎవరూ ప్రమాదాలబారిన పడకూడదని, ఒక్క మరణం సంభవించకూడదనేది ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. సముద్ర తీరంలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వారికి 25 కేజీల బియ్యంతో సహా నిత్యావసరాలు అందించాలన్నారు. కరువును ఎదుర్కొనేందుకు ఎలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామో, తుఫాన్లను ఎదుర్కొనేందుకూ పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు జరపాలని సీఎం చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రధానికి వివరించగా, కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని ప్రధాని భరోసా ఇచ్చారని తెలిపారు. ప్రధాని కార్యాలయంతో సమన్వయం చేసుకునే బాధ్యతను మంత్రి లోకేష్‌కు ముఖ్యమంత్రి అప్పగించారు.

**కృష్ణా జిల్లాలో అతిభారీ వర్షాలకు అవకాశం :** ప్రస్తుతం కాకినాడకు 680 కి.మీ. దూరంలో ఉన్న మొంథా తుఫాన్... 16 కి.మీ వేగంతో తీరానికి చేరువ అవుతోందని... దీని ప్రభావంతో ఇప్పటికే ఉత్తర, దక్షిణ కోస్తాలో వర్షాలు కురుస్తున్నాయని... మంగళవారం కృష్ణా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించామని తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులందరినీ వెనక్కి రప్పించినట్టు వెల్లడించారు. గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, పల్నాడు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. మంగళవారం రాత్రికి తుఫాన్ తీరానికి చేరే అవకాశం ఉందన్నారు. ఎక్కువ వర్షపాతం కురిసే ప్రాంతాలను గుర్తించి జిల్లా అధికారులు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎన్డీఆర్, ఎస్డీఆర్ దళాలు అందుబాటులో ఉండాలని, ఫైర్ సర్వీసెస్ కూడా అలెర్ట్‌గా ఉండాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ టీమ్, రహదారులు-భవనాల శాఖ, విద్యుత్ శాఖ పూర్తి అప్రమత్తతో వ్యహరించాలన్నారు. రహదారులు కోతకు గురైనా, విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడినా వెంటనే పునరుద్ధరించేలా మెటీరియల్, మిషనరీ సిద్ధం చేయాలని, కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని మిగతా 2లో...

## తీరప్రాంత ప్రజల్ని పునరావాస కేంద్రాలకు
# తరలించండి



- ప్రతీ కేంద్రానికి ఇన్‌ఛార్జ్...
- నాణ్యమైన ఆహారం, మెడికల్ క్యాంపులు
- తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు
- వాలంటరీగా వచ్చేవారితో సహాయక చర్యలు చేపట్టండి
- జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు నిర్దేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ముప్పు ఉన్న తీరప్రాంత ప్రజలను తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం నుంచి తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు ప్రత్యేకంగా ఇన్‌ఛార్జ్‌లను నియమించాలని ఆదేశించారు. సోమవారం ఉదయం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి మొంథా తుఫాన్‌పై అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి, మధ్యాహ్నం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, మిగతా 2లో...

## ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఉండాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తుఫాను ప్రభావం అధికంగా ఉండే నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని విద్య, ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ కార్యాలయంలో మొంథా తుఫాన్‌పై సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. ప్రస్తుత సమాచారం ప్రకారం కాకినాడ సమీపంలో తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలోని ప్రజాప్రతనిధులు, అధికారులు సంయుక్తంగా పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సాయం అందించాలని చెప్పారు. అవసరమయితే కూటమి పార్టీలకు చెందిన కేడర్ ఆయా ప్రాంతాల్లో సహాయ చర్యల్లో పాల్గనాలని సూచించారు. లంక గ్రామాల్లోని ప్రజల కోసం ముందస్తుగా సహాయ శిబిరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. శిబిరాల్లో నిరాశ్రయులకు అవసరమైన ఆహారం, నీరు సిద్ధంగా ఉంచాలని వెల్లడించారు. భారీవర్షాల కారణంగా ఎటువంటి అంటురోగాలు ప్రజబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది చర్యలు చేపట్టాలని చెప్పారు. అత్యవసర వైద్యసేవల కోసం అంబులెన్స్‌లు, మందులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. మిగతా 2లో...

## కర్నూలు బస్సు ప్రమాదంపై
# వైసీపీ శవ రాజకీయాలు

- విషాదాలను రాజకీయాలకు వాడుకోవడం వైసీపీకి తెలిసిన విద్య



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జగన్మోహన్ రెడ్డి నీచ శవ రాజకీయాలు పరాకాష్టకు చేరాయని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. ప్రభుత్వ విధానాలను విమర్శించొచ్చు, ప్రభుత్వ పరంగా రాజకీయం చేస్తే తప్పు లేదు కానీ దుర్ఘటనలు, మరణాలపై రాజకీయం చేయడం దారుణమని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన... కర్నూల్ బస్సు యాక్సిడెంట్..అందర్నీ కలిచివేసిందన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుందన్నవారు. దుబాయ్ లో ఉన్న సీఎం చంద్రబాబు గారు వెంటనే స్పందించారన్నారు. మంత్రులు ఘటన స్థలానికి వెళ్లి... సహాయక చర్యలు జరిగేలా చూశారు. బాధితులకు ధైర్యం చెప్పారన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కులం,మతం,ప్రాంతం, రాజకీయ పార్టీలు అని తేడా లేకుండా స్పందించాల్సిన సమయంలో వైసీపీ పార్టీ మాత్రం నీచ రాజకీయాలను ఎంచుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శవ రాజకీయాలు చేయడమే వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కర్నూలు బస్సు ప్రమాద విషయంలో వైసీపీ, సాక్షి మీడియా అనేక తప్పుడు కథనాలు సృష్టిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు కథనాలు రాస్తున్న మీడియా ఛానెల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**బైకర్ బెల్టు షాపులో మద్యం కొనలేదు:** రాష్ట్రంలో అర్ధరాత్రి బెల్టు షాపులు నడుస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. చనిపోయిన బైకర్, మద్యన్ని బెల్ట్ షాప్‌లో కాదు, ప్రభుత్వ అనుమతి పొందిన లైసెన్స్‌డ్ దుకాణం నుంచే కొనుగోలు చేసినట్టు సీసీటీవీ ఫుటేజీలో ఉందన్నారు. మిగతా 2లో...

## మొంథా తుపానును ఎదుర్కొనేందుకు
# సిద్ధంగా ఉండండి

- ప్రభావిత ప్రాంతాల్లో యంత్రాంగాన్ని అప్రమత్తం గా. ఉండాలి
- ప్రాణ నష్టం సంభవించకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి
- పునరావాస కేంద్రాల్లో ఆహారం, రక్షిత తాగునీరు, పాలు, ఔషధాలు సిద్ధం చేసుకోవాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ , మంత్రి నారాయణ. వీడియో కాన్ఫరెన్స్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాను కాకినాడ ప్రాంతంలో తీరం దాటనున్న నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం స్పష్టం చేశారు. జిల్లా పరిధిలోని 12 మండలాల పరిధిలో తుపాను ప్రభావం ఉండనున్న క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రభావిత ప్రాంతాల ప్రజలను ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, వృద్ధులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. అంబులెన్సులు, అత్యవసర సర్వీసులు సిద్ధం చేసుకోవాలని, ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్య పెంచుకోవాలని సూచనలు చేశారు. మిగతా 2లో...

## రాష్ట్రంలో రూ.33,630 కోట్ల రైల్వే ప్రాజెక్టులు



- పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో సమీక్షించారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి తక్షణం చేపట్టాల్సిన చర్యలు, రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు. నడికుడి-శ్రీకాళహస్తి, గుంటూరు- గుంతకల్, గుణదల ముస్తాబాద్ బైపాస్, రాయదుర్గ్- తుముకూరు మధ్య రైల్వేలైన్ ప్రాజెక్టుల పురోగతిపై చర్చ జరిగింది.

అలాగే రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, అమృత్ భారత్ స్టేషన్ల అభివృద్ధి, రైల్వే ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రైల్వేశాఖకు ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 33,630 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు పురోగతిలో వున్నాయి. సమీక్షకు మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ శ్రీవాస్తవ, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వే అధికారులు హాజరు అయ్యారు.

**అత్యధికంగా రైల్వేవి 28 :** కేంద్ర నిధులతో రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల్లో రైల్వేవి అత్యధికంగా 28 ఉన్నాయి. ఇందులో మలుగూరు - పాలసముద్రం మధ్య 17.97 కిలోమీటర్ల పొడవైన కొత్త రైల్వే ప్రాజెక్టు, గుంతకల్లు వెస్ట్-మల్లప్ప గేట్ రైల్ ఓవర్ రైల్ ట్రాక్, తిరుపతి-కాట్పాడి మధ్య

## మొంథా తుఫాన్.. 43 రైళ్లు రద్దు



- విశాఖ మీదుగా నడిచే పలు రైలు రద్దు
- కొన్ని కీలకమైన రైళ్లు రద్దు
- తుఫాన్ తర్వాత పునరుద్ధరణ
- ఆంధ్ర వైపు దూసుకొస్తున్న తుఫాన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ఆంధ్రా వైపు దూసుకొస్తోంది. దీంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇదిలా ఉండగా.. మొంథా తుఫాన్ నేపథ్యంలో రైల్వేశాఖ అలర్ట్ అయ్యింది. తుఫాను కారణంగా ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని విశాఖ మీదుగా నడిచే 43 రైళ్లను రద్దు చేస్తున్నట్లుగా తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. రద్దయిన రైళ్లలో గోదావరి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, గరీబ్ రథ్,

## సెలవుల్లో ఉన్న అధికారులు వెంటనే విధుల్లో చేరాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాను ప్రభావిత జిల్లాల్లో ఇరిగేషన్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, సిఈ స్ధాయి నుండి కింది స్ధాయిలోని లష్కర్ వరకు క్షేత్ర స్ధాయిలో పర్యటించాలని ఆదేశించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు. సోమవారం అమరావతి సచివాలయంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మిగతా 2లో...



## తుఫాన్‌పై ప్రభుత్వం హై అలర్ట్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ తీరం దాటనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. అధికారులంతా పూర్తి స్థాయి అప్రమత్తతతో ఉండాలని సూచనలు జారీ చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మిగతా 2లో...

## తుఫాన్‌పై ప్రజలను తప్పుదారి పట్టించొద్దు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఇలాంటి సమయంలో సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలకు ఆస్కారం ఇవ్వొద్దని హోం మంత్రి ఒక ప్రకటనలో కోరారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయని ఆమె తెలిపారు. మిగతా 3లో...



### తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి...

# ప్రాణ నష్టం జరగకూడదు



(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. తుఫాను అనంతరం అంటువ్యాధులు సోకకుండా పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. తుఫాను సమయంలో గర్భిణిలు, బాలింతలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచి వైద్యసౌకర్యాలు కొనసాగేలా చూడాలన్నారు. యాంటీ స్నేక్ వెనోమ్, యాంటి ర్యాబిస్ వ్యాక్సిన్లు కూడా అన్ని పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. మరోవైపు పంటనష్టం సంభవించకుండా టార్పాలిన్లు విరివిగా ఉంచాలని, పశుసంపద నష్టపోకుండా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో 851 జేసీబీలు, 757 పవర్ సాలు సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, ఏ ప్రాంతంలో అందుబాటులో ఉంచారనేది మ్యాపింగ్ చేయాలని... తుఫాన్ అనంతరం వీటన్నింటి వినియోగంపైనా ఆడిటింగ్ చేస్తామని సీఎం చెప్పారు. వరద నీరు వెళ్లేందుకు వీలుగా డ్రెయిన్లలో బ్లాక్స్ లేకుండా పటిష్టం చేయాలని నిర్దేశించారు.

**విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు :** 'తుఫాన్ తీరం దాటే సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా అలర్ట్ చేయాలి. ఎప్పటికప్పుడు సందేశాలు పంపించి అవగాహన పెంచాలి. తిత్లీ, హరికేన్, హుద్‌హుద్ తుఫాన్లపై అనుభవాన్ని ఇందుకు వినియోగించాలి. అన్ని రిజర్వాయర్లు, ట్యాంకులు ఎలా నిర్వహించాలనే దానిపై జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయండి. రియల్ టైమ్‌లో నీటి ప్రవాహాలను పర్యవేక్షించాలి. బలమైన గాలులకు కూలిపోయే అవకాశం ఉన్న చెట్ల కొమ్మలను ముందుగానే తొలిగించాలి.' అని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. అలాగే తుఫాన్ రక్షణ విధుల్లో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో మంత్రులు లోకేష్, అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖలకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తీరప్రాంత ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించండి



(మొదటి పేజీ తరువాయి)

ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ చేపట్టారు. తాగునీటి సమస్య తలెత్తకుండా, ఎక్కడా కలుషితం కాకుండా చూసుకోవాలని చెప్పిన సీఎం అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తుఫాను ప్రభావిత జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు నిర్దేశించారు. జిల్లాల్లో తుఫాను రక్షణ చర్యలను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని, వాలంటరీగా వచ్చేవారిని తుఫాన్ సహాయక కార్యక్రమాలకు వినియోగించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగమంతా నిబద్ధతతో పనిచేసి మొంథా తుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కోవాలని అన్నారు.

**కొండచరియలు జారిపడకుండా జాగ్రత్తలు**

మానవ ప్రయత్నంలో ఎటువంటి అలసత్వం కనిపించకూడదని చెప్పిన ముఖ్యమంత్రి... వివిధ జిల్లాల కలెక్టర్లతో అక్కడ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయని... అన్ని రక్షణ చర్యలు తీసుకున్నామని ఆ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సీఎంకు వివరించారు. ఆర్టీజీఎస్ నుంచి సమాచారం ఎప్పటికప్పుడు అందుతుందని... ఎక్కడా చెరువులు, కాలువ గట్లు తెగకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాలతో నీరు ఎక్కడా నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. తుఫాను సమయంలో ప్రజలు ఎవరూ బయటకు రాకుండా చూసుకోవాలని చెప్పారు. విజయవాడ, మంగళగిరి, విశాఖ వంటి కొండ ప్రాంతాల్లో కొండచరియలు జారిపడి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. మొంథా తుఫాన్ కార్యాచరణ భవిష్యత్‌లో వచ్చే తుఫాన్లను ఎదుర్కొనేందుకు ఒక మోడల్ కావాలని చెప్పారు.

# సెలవుల్లో ఉన్న అధికారులు వెంటనే విధుల్లో చేరాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో కడా స్పెషల్ కమీషనర్ ప్రశాంతి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సి నరసింహ మూర్తి, మరియు సిఈలు, ఎస్ఈలు, ఈఈలు, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు అందరూ తమకు కేటాయించిన హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని, అధికారులు తమ సెలవులు రద్దుచేసుకుని, తప్పని సరిగా విధులకు హాజరుకావాలని ఆదేశించారు.

చెరువులు, కాల్వ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలి అని, ఇందుకోసం ఇసుక బస్తాలు, మోటార్లు, బోట్లువంటి అత్యవసర సామాగ్రి సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు, గేట్లు, స్ల్యూయిజ్ లు, సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో, ఎప్పిటికప్పుడు తనిఖీ చేయాలని, అధికారులకు సూచించారు. తుఫాన్ కారణంగా వాగులు, రిజర్వాయర్ల నుండి దిగువకు నీరు విడుదల చేసేముందు, సమీప ప్రవాహ ప్రాంత ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేయాలి అని అన్నారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, పంటలకు నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అన్నారు.

ఎన్టీఆర్ జిల్లా లో వర్షపాతాన్ని దృష్టిలో పెట్టుకుని, బుడమేరు డైవర్షన్ ఛానెల్ పై నిరంతర నిఘా ఉండాలని, వెలగలేరు రెగ్యులేటర్ నుండి ఎనికేపాడు యూటీ వరకు విజయవాడ నగర పరిధిలో ఓల్డ్ బుడమేరు అంతా, ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా, తొలగించాలి అని తెలిపారు. ఎర్ర కాలువ, యనమదురు డ్రైన్, బురద కాలువ, సుద్ద వాగు, ఏలేరు రిజర్వాయర్,రైవాడ కాలువ వంటి వాటిపై నిరంతర నిఘా పెట్టాలి అని, జిల్లా కలెక్టర్, రెవిన్యూ, డిజాస్టర్ మేనేజ్మెంట్, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, శాఖలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

# మొంథా తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

మండలాల వారీగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి సమాచారం కోసం అత్యవసర ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. మొంథా తుపాను ప్రభావం, ముందస్తు సహాయక చర్యలపై జిల్లా ఇంఛార్జి మంత్రి పి. నారాయణ , స్పెషల్ ఆఫీసర్ కృష్ణ తేజ , జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ , జిల్లా ఎస్పీ బిందు మాధవ్ , ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లా పరిధిలోని 12 మండలాలపై ఉండనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరికల ద్వారా తెలుస్తోంది. రేపు కాకినాడ పరిసరాల్లో తీరం దాటే అవకాశం ఉంది. తుపాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుపానును ఎదుర్కొనేందుకు ప్రభావిత మండలాల పరిధిలో యంత్రాంగం పూర్తి సన్నద్ధతో ఉండాలి. ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాలి. ముందుగా తీర ప్రాంత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 260 పునరావాస కేంద్రాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. పిఠాపురం నియోజకవర్గంతో పాటు కాకినాడ జిల్లావ్యాప్తంగా గర్భిణి స్త్రీలు, బాలింతలు, వృద్ధులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఇప్పటికే 142 మంది గర్భిణులను గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించినట్టు



జిల్లా కలెక్టర్ తెలిపారు. వారికి అవసరం అయిన పౌష్టికాహారం, వైద్య సాయం అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియపర్చండి. తుపాను పట్ల ప్రజల్లో భయాందోళనలు లేకుండా గ్రామాల్లో మైకుల ద్వారా తుపాను ప్రభావం, తీసుకుంటున్న సహాయక చర్యలను వివరించాలి. గజ ఈతగాళ్లను తీర ప్రాంతంతో పాటు లోతట్టు ప్రాంతాలు, వాగుల వద్ద సిద్ధంగా ఉంచాలి. గాలుల తీవ్రతకు విద్యుత్ స్తంభాలు నేల కూలే అవకాశం ఉంది. తక్షణం వాటిని పునరుద్దరించేందుకు చర్యలు తీసుకోవాలి. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బ తినే అవకాశం ఉన్నందున అత్యవసర పరిస్థితుల్లో యంత్రాంగం శాటిలైట్ ఫోన్ల ద్వారా సమాచారం చేరవేయాలి.

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి:** తుపాను ప్రభావం ఉన్న అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, వీర్వోలు అందుబాటులో ఉండాలి. పోలీసులు... ముంపు ప్రాంతాల్లో భద్రత చర్యల పర్యవేక్షణ పెంచాలి. పునరావాస కేంద్రాలకు వెళ్లే ప్రజల ఇళ్లకు సైతం భద్రత కల్పించాలి. ప్రజలు ఇళ్లలో లేని సమయంలో దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలతో ప్రత్యేక భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున నీటి పారుదల శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలి. బలహీనంగా ఉన్న చెరువులు, వాగులు, కుంటల గట్లను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలి. గండ్లు పడితే పూడ్చేందుకు వీలుగా ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలి.

తుపాను తీవ్రత ఉన్నందున మత్స్యకార గ్రామాలను మత్స్యశాఖ అధికారులు అప్రమత్తం చేయాలి. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా కట్టడి చేయాలి. మత్స్యకారుల బోట్లు దెబ్బ తినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. కూరగాయలు, నిత్యవసర సరకుల సరఫరాకు అడ్డంకులు లేకుండా మార్కెటింగ్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి.

తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అత్యవసర సాయం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం రూ. 19 కోట్ల విడుదల చేసింది. అందులో కాకినాడ జిల్లాకు కోటి రూపాయిలు కేటాయించారు. ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, ప్రజలకు నిత్యవసర సరుకుల పంపిణీ, ఇళ్లు కూలడం, దెబ్బ తినడం వంటి సంఘటనలు జరిగితే తక్షణ సాయం చేయడం వంటి చర్యలు తీసుకోవాల"ని దిశానిర్దేశం చేశారు.

# మొంథా తుఫాన్.. 43 రైళ్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం తిరుపతి ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్, ఎల్టీటీతో పాటు పలు ప్రధాన రైళ్లు, పలు పాసింజర్ రైళ్లు ఉన్నాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు అంటే అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో విశాఖ మీదుగా సాగే రైల్వే సర్వీసులు రద్దు అ-య్యాయి. క్యాన్సెల్ అయిన రైలు సర్వీసుల జాబితాను రైల్వే శాఖ విడుదల చేసింది. తుఫాను తీవ్రతను బట్టి రైల్వే సర్వీసులను పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




**రద్దయిన రైళ్లు వివరాలు :**

27, 28 తేదీల్లో 18515/16 విశాఖపట్నం కిరణ్ డోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27, 28 తేదీల్లో 18525/26 విశాఖపట్నం బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27వ తేదీన 22707 విశాఖపట్నం – తిరుపతి డబల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు, 27వ తేదీన 17243/44 గుంటూరు – రాయగడ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27వ తేదీన 12727 గోదావరి ఎక్స్‌ప్రెస్ రద్దు, 27వ తేదీన 12738 విశాఖ సికింద్రాబాద్ మధ్య నడిచే గరీబ్ రథ్ రద్దు, 27వ తేదీన 22707 విశాఖపట్నం తిరుపతి డబల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రద్దు, 27, 29 తేదీల్లో 20805/06 విశాఖపట్నం న్యూఢిల్లీ ఏపీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27, 29 తేదీల్లో 18519/20 ఎల్టీటీ – విశాఖపట్నం (ఎక్స్‌ప్రెస్) రాకపోకలు రద్దు, 27, 28 తేదీన 12861/ 62 విశాఖపట్నం – మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు, 27, 28 తేదీల్లో 22869/70 విశాఖపట్నం ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27, 28 తేదీల్లో 08583/84 విశాఖపట్నం తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27, 28 తేదీల్లో 18512/11 విశాఖపట్నం – కొరాపుట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27, 28 తేదీల్లో 67287/88 విశాఖపట్నం – కిరణ్ డోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రాకపోకలు రద్దు, 27, 28 తేదీల్లో 67287/88 విశాఖపట్నం – విజయనగరం రైలు రాకపోకలు రద్దు, 28వ తేదీన 67289/90 విశాఖపట్నం – పలాస రాకపోకలు రద్దు, 28వ తేదీన 67285/86 రాజమండ్రి – విశాఖపట్నం రాకపోకలు రద్దు, 28వ తేదీన 17267/68 విశాఖపట్నం – కాకినాడ ఎక్స్ప్రెస్ రాకపోకలు రద్దు, 28వ తేదీన 58501/02 కిరణ్ డోల్ – విశాఖపట్నం పాసింజర్ రైలు రాకపోకలు రద్దు, 28వ తేదీన 58538/37 కోరాపుట్ – విశాఖపట్నం రాకపోకలు రద్దు, 28వ తేదీన 22875/76 విశాఖపట్నం – గుంటూరు డబల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు రాకపోకలు రద్దు, 28వ తేదీన 58531/32 బ్రహ్మపూర్ – విశాఖపట్నం పాసింజర్ రాకపోకలు రద్దు, 28వ తేదీన 58506/05 విశాఖపట్నం – గుణుపూర్ పాసింజర్ రాకపోకలు రద్దు, 28, 29 తేదీల్లో 68433/34 కటక్ – గుణుపూర్ రైలు రాకపోకలు రద్ద చేశారు. రద్దయిన రైళ్ళను తుఫాను ప్రభావం అనంతరం పునరుద్ధరిస్తామని రైల్వే శాఖ అధికారులు వెల్లడించారు.

# తుఫాన్‌పై ప్రభుత్వం హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆర్టీజీఎస్ కేంద్రంలో ఉదయం నుంచే పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని, అవసరమైన సూచనలు అధికారులకు అందజేస్తున్నారని. గత రెండు రోజులుగా అన్ని విభాగాల అధికారులను అలర్ట్‌లో ఉంచామని పేర్కొన్నారు.

**తుఫాన్ తీవ్రత పెరిగే అవకాశం :** మొంథా తుఫాన్ ప్రభావంతో ఈ రోజు రాత్రి నుంచే భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందని మంత్రి తెలిపారు. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వివరించారు.

**మత్స్యకారులకు సూచనలు - లోతట్టు ప్రాంతాల తరలింపు :** సముద్రంలో ఉన్న మత్స్యకారులను ముందుగానే వెనక్కి పిలిపించామని, వారి భద్రత కోసం అన్ని చర్యలు తీసుకున్నామని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించామని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించామని చెప్పారు.

**ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉంది :** రాష్ట్ర ప్రభుత్వం అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. "ప్రజల ప్రాణనష్టం జరగకుండా ప్రతి స్థాయిలో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉంది," అని అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

# శ్రీశైలం దేవస్థానం వృక్ష ప్రసాద కార్యక్రమం విజయవంతం



శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) : ధర్మప్రచారంలో భాగంగా శ్రీశైలం దేవస్థానం చేపట్టిన ఉచిత వృక్ష ప్రసాద కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కార్తీక సోమవారం సందర్భంగా ఉదయం నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు ఉసిరి, తులసి, బిల్వం వంటి పవిత్ర మొక్కలను పంపిణీ చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పి. ఆదినారాయణరాజు, నాగవల్లి దంపతులు ఈ సందర్భానికి 21 వేల మొక్కలను విరాళంగా అందించటం జరిగింది. ఈ వితరణ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి వై. శ్రీనివాసరావు, దాతలు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తుల లో ధార్మికత మరియు పర్యావరణ చేతన పెంపొందించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ప్రత్యేకంగా నిర్వహించింది.

# గిరిజనులకు త్వరలో దోమ తెరల పంపిణీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎంపికచేసిన గిరిజనుల కుటుంబాల వారికి 89,845 దోమ తెరలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దోమల ద్వారా వచ్చే మలేరియా జ్వరాల వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా దోమ తెరలను ఎంపిక చేసిన గిరిజనుల కుటుంబాలకు ఇస్తామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గడిచిన 3 సంవత్సరాల్లో అధికంగా నమోదైన మలేరియా జ్వరాల కేసుల ప్రాతిపాదికన అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కలిపి, ఎంపికచేసిన 743 గ్రామల్లోని గిరిజనులకు వీటిని అందచేస్తామని తెలిపారు పార్వతీపురం మన్యం జిల్లాకు 26,338, అల్లూరి సీతారామరాజు జిల్లాకు 63,507 దోమ తెరలను పంపిణీ చేస్తామని తెలిపారు. వీటి ద్వారా ఎంపికచేసిన సదరు కుటుంబాల్లో ఉన్న సుమారు 2 లక్షల మంది గిరిజనులు ప్రయోజనం పొందుతారని వెల్లడించారు. 89,845 దోమతెరల కొనుగోలుకు రూ. 2.30 కోట్లు వరకు వ్యయం కావొచ్చునని అంచనా నెల రోజుల్లో గిరిజనులకు వీటిని అందచేయనున్నారు.

**క్రిమిసంహారక మందుతో తెరల తయారీ.!**

క్రిమీ సంహారక మందును వినియోగించి తయారుచేసిన ఈ దోమ తెరలు దోమలను సంహరిస్తాయి. నిదురపోయే సమయంలో సాధారణ దోమ తెరలు మాదిరిగానే వీటినీ ఉపయోగిస్తారు. వినియోగతీరును అనుసరించి ఈ దోమ తెరలు మూడేళ్ల నుంచి నాలుగేళ్ల వరకు పనిచేస్తాయి.

# కర్నూలు బస్సు ప్రమాదంపై వైసీపీ శవ రాజకీయాలు



(మొదటి పేజీ తరువాయి)

అది కూడా రాత్రి 8 గంటలు ఆ సమయంలో కొనుగోలు చేసినట్లు తెలుస్తోందన్నారు. నిందితుడు కొనుగోలు చేసిన షాపు రోడ్డుకు చాలా దూరంలో ఉందన్నారు. నిబంధనలు ప్రకారమే రాష్ట్రంలో మద్యం షాపులు నడుస్తున్నాయని ఆలపాటి అన్నారు.

**బస్సుకు పర్మిట్ లేదన్నారు:** బస్సు ప్రమాదంలాంటి కష్ట కాలంలో సాయం చేయాల్సింది పోయి... అసత్య ప్రచారాలు చేయడం బాధకరమని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బస్సుకు పర్మిట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ సరైనా పత్రాలు లేవని తప్పుడు కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. సిద్ధాంతపరంగా రాజకీయ పోరటాలు చేయెచ్చు కానీ ఇలాంటి విషయంలో రాజకీయాలు చేస్తారా? అని ప్రశ్నించారు. వైసీపీ హయంలో కల్తీ మద్యంతో చాలా మంది చనిపోయారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో వైసీపీ పార్టీ నాయకులు జైలుకు వెళ్లారని.. మద్యం కుంభకోణాలు, కల్తీ మద్యం అంశం పక్కదోవ పట్టించడానికి కర్నూలు బస్సు ప్రమాదం ఎంచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పోలవరం కాపర్ డ్యామ్, అమరావతిపై కూడా ఇలానే తప్పుడు ప్రచారాలు చేశారన్నారు. ఉద్యోగులకు డీఏ ఇవ్వలేదని ప్రచారం చేశారన్నారు. ప్రభుత్వ ధనం ఎలా దోచుకోవాలో వైసీపీ వాళ్లకే తెలిసిన విద్య అని.. పార్టీ కార్యకర్తను కారుతో తొక్కించిన చరిత్ర వైసీపీ పార్టీదని తీవ్రంగా విమర్శించారు. తప్పుడు ప్రచారాలు చేస్తోన్న మీడియాలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఉండాలి



(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఆ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ సమస్యలు తలెత్తకుండా సెల్‌ఫోన్ ఆపరేటర్లు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భారీవర్షాల కారణంగా చెరువు కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ఇసుక బస్తాలు, యంత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పంటపొలాల్లో నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున ఆయిల్ మోటార్లు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. తుపాను పరిస్థితులను గమనిస్తూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాన్ బాధితులకు ఎటువంటి సాయం అవసరమైన వెంటనే స్పందించేందుకు యంత్రాంగం నిరంతరం సిద్ధంగా ఉంటుందని వెల్లడించారు.

# రాష్ట్రంలో రూ.33,630 కోట్ల రైల్వే ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

104.39 కిలోమీటర్ల లైన్, గూడూరు-రేణిగుంట మధ్య 83.17 కి.మీ. మూడో లైన్, ముధ్‌ఖేడ్, మేడ్చల్ మహబూబ్‌నగర్, డోన్ సెక్షన్‌లో 417.88 కి.మీ. డబ్లింగ్, విజయనగరం-సంబల్‌పూర్ మూడో లైన్, మల్కన్‌గిరి-పాండురంగాపురం మధ్య కొత్త రైల్వే లైన్, ఎర్రుపాలెం-అమరావతి నంబూరు రైల్వే లైన్ నిర్మాణాలు ఇంకా జీరో పురోగతిలోనే ఉన్నాయి. కర్నూలు 3 పీఎస్?ఆర్? ఈ ట్రాన్స్‌మిషన్ లైన్, కర్నూలు-4 ఆర్‌ఈజెడ్ ఫేజ్-1 ట్రాన్స్‌మిషన్ సిస్టం ప్రాజెక్టులూ సున్నా స్థాయిలోనే ఉన్నాయి.

అయితే రాష్ట్రంలోని ఒంగోలు నుంచి దొనకొండ, దూపాడు నుంచి బేతంచర్ల, మచిలీపట్నం నుంచి నరసాపురం, రేపల్లె వంటి ప్రాంతాలకు కొత్త రైల్వే లైన్లు నిర్మించేలా సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు సిద్ధమవుతున్నాయి. ఏపీ మీదుగా హైదరాబాద్ నుంచి బెంగళూరు, హైదరాబాద్ నుంచి చెన్నైలకు బుల్లెట్ రైళు నడిపేలా హైస్పీడ్ కారిడార్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న మార్గాల్లో రైళ్ల రద్దీ ఎక్కువగా ఉండే వైపు అదనంగా మూడు, నాలుగు, ఐదు, ఆరో లైన్ నిర్మాణానికి డీపీఆర్‌లు తయారు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 1,960 కి.మీ. మేర 26 ప్రాజెక్టులకు రైల్వేశాఖ డీపీఆర్‌లు రూపొందిస్తోంది.

**11 మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణం :** ఇప్పటివరకు రైలు అనుసంధానం లేని 11 మార్గాల్లో కొత్త లైన్ల నిర్మాణంపై రైల్వేశాఖ దృష్టిపెట్టింది. వీటికి గతంలోనే సర్వేలు చేయగా, రైల్వే బోర్డు ఆమోదం నేపథ్యంలో డీపీఆర్‌లు రూపొందిస్తున్నారు. కొన్నిచోట్ల బైపాస్ లైన్లు, రైల్ ఒవర్ రైల్ వంతెనల నిర్మాణంపైనా దృష్టిపెట్టారు. హైదరాబాద్-బెంగళూరు మధ్య నిర్మించే హైస్పీడ్ కారిడార్‌లో ఏపీలో 300 కి.మీ., హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్‌లో ఏపీలోని 464 కి.మీ.కు డీపీఆర్‌లపై దృష్టిపెట్టారు.

సరకు రవాణాకు మూడు, నాలుగో లైన్లు : విజయవాడ-చెన్నై, విజయవాడ-హైదరాబాద్, విజయవాడ-విశాఖపట్నం మార్గాల్లో సరకు రవాణా రైళ్ల రాకపోకలు అంతకంతకు పెరుగుతున్నాయి. దీంతో ఈ మార్గాల్లో మూడు, నాలుగో లైన్ల నిర్మాణంపై దృష్టిపెట్టారు. ఇప్పటికే కొన్ని మార్గాల్లో మూడో లైను నిర్మిస్తున్నారు. ఒడిశా వైపు నుంచి కొత్తవలస మీదుగా విశాఖపట్నానికి బొగ్గు, వివిధ ఖనిజాలు రవాణాచేసే రైళ్లు భారీగా ఉంటున్నాయి. దీంతో విశాఖపట్నంలోని సింహాచలం నార్త్ నుంచి కొత్తవలస వరకు ఐదు, ఆరో లైన్ల నిర్మాణానికి డీపీఆర్‌లు రూపొందిస్తున్నారు.

# మంత్రి సత్యకుమార్‌కు జేపీ నడ్డా ఫోన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బాజాపా జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జేపీ నడ్డా మొంథా తుపాను ప్రభావంపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సోమవారం రాత్రి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మొంథా ప్రభావం 17 జిల్లాలపై కనిపించే అవకాశముందని చెప్పారు. తుపాను ప్రభావాన్ని సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. వైద్యారోగ్య శాఖ కూడా ముందస్తు జాగ్రత్తతో అవసరమైన చోట్ల ప్రజలకు సేవలందించేలా కార్యాచరణ సిద్ధం చేసిందని నడ్డా కు మంత్రి సత్యకుమార్ వివరించారు. అనంతర%శీ

%జేపీ నడ్డా మాట్లాడుతూ...పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి తుపాను సహాయక చర్యల్లో పాల్గొనేలా పార్టీ శ్రేణులకు పిలుపునివ్వాలని సూచించారు.

# ఆసుపత్రులకు 787 మంది గర్భిణిల తరలింపు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** 'మొంథా' తుపాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ప్రసవ తేదీకి వారం రోజుల వ్యవధి కలిగిన సుమారు 787 మంది గర్భిణిలను సమీప ఆసుపత్రులకు తరలించినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఎ.ఎన్.ఎం.ల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. ప్రసవ సమయానికి దగ్గర్లో ఉన్న గర్భిణిలను సామాజిక, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు స్థానిక అధికారులు పంపిస్తున్నారని చెప్పారు. హైరిస్కులో ఉన్న గర్భిణిల విషయంలో వైద్యులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలిపారు. కృష్ణా జిల్లాలో 240, ఏలూరు జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 150, తూర్పు గోదావరి జిల్లాలో 142 మంది గర్భిణిలను ఇప్పటివరకు తరలించినట్లు తెలిపారు.

అలాగే ఇతర జిల్లాల్లో కూడా ఇదేవిధంగా గర్భిణిలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

తుపాన్ ప్రభావిత 17 జిల్లాల్లో ఈ చర్యలు కొనసాగుతున్నాయని సోమవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

**పీహెచ్ సి వైద్యుల నేతృత్వంలో వైద్య శిబిరాలు :** తుపాన్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని 17 జిల్లాల్లో ప్రభుత్వం ఏర్పాటుచేసిన షెల్టర్ల (పునరావాస కేంద్రాలు)లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి వైద్య శిబిరంలో ఓ పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్, ఎ.ఎన్.ఎం., ఆశా వర్కర్ ను నియమించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 551 షెల్టర్లను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని చెప్పారు. ఉప ఆరోగ్య కేంద్రాల్లో సీహెచ్ ఓ లు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

**నిశితంగా హాజరు పరిశీలన :** తుపాన్ సహాయక విధుల్లో పాల్గొనే వారి హాజరును నిశితంగా పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ స్పష్టంచేశారు. జిల్లాలకు పంపిన ప్రామాణిక విధి విధానాలు (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్స్)కు అనుగుణంగా అధికారులు, వైద్యులు, సిబ్బంది వ్యవహరించాలని స్పష్టంచేశారు. సోమవారం సాయంత్రం అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, జిల్లా అధికారులతో... కార్యదర్శితోపాటు ఇంఛార్జి ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ నీలకంఠారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ను సందర్శించిన కార్మిక శాఖ మంత్రి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్న స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సాయంత్రం సందర్శించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితిలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ముందస్తు సమాచారాన్ని అధికారులకు, ప్రజలకు సకాలంలో అందజేస్తూ వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. సంభవించబోయే భారీ తుఫాను నేపథ్యంలో ఎటువంటి ప్రాణనష్టం కానీ ఆస్తి నష్టం గాని జరగకుండ మందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆహార పదార్థాలు, అత్యవసర వస్తువులు, త్రాగునీరు అందుబాటులో ఉంచాలని అధికారులు నిరంతరం శిబిరాల వద్ద ఉండి వరద బాధితులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ లో రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులను, తుఫాను ప్రభావాన్ని టీవీ మానిటర్లలో పరిశీలించారు.

# నేడు ఎస్ఆర్ఎం వర్సిటీ 5వ స్నాతకోత్సవం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. మంగళవారం ఉదయ 11 గంటలకు యూనివర్శిటీ ఆడిటోరియంలో విద్యార్థులకు డిగ్రీల ప్రదానం జరుగనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ మేరకు యూనివర్సిటీలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

యూనివర్సిటీలో 2020-25 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ చదివిన 1877 మంది విద్యార్థులకు, మరో 39 మంది పరిశోధనా విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. ఇందులో 45 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు, 7 నుంది స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులకు, నలుగురు లిబరల్ ఆర్ట్స్ విద్యార్థులకు ఈ సందర్భంగా బంగారు, వెండి పతకాలను ప్రదానం చేయనున్నారు.

స్నాతకోత్సవం ఉదయం 11 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం రెండు గంటలకు ముగియనుంది. సోమవారం ఉదయం యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ ప్రేమ్ కుమార్లు ఆడిటోరియంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

స్నాతకోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ తో పాటు యూనివర్సిటీ కులపతి డాక్టర్ టీఆర్ పారివేంధర్, ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, ఇన్ చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్, గవర్నింగ్ బాడీ మెందర్లు పాల్గొంటున్నారు.

# మొంథా తుఫాన్‌కు దీటుగా ప్రజలకు బాసటగా నిలుస్తాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు: రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుఫాన్ కు సంబంధించిన అన్ని జాగ్రత్తలను తీసుకుందని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం సోమవారం ముంబయి పర్యాటక పర్యటనకు బయలుదేరి వెళ్లిన మంత్రి కందుల దుర్గేష్ హైదరాబాద్ చేరుకోగానే

మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తన పర్యటనను రద్దు చేసుకొని తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నారు. ఎయిర్ పోర్ట్ నుండి నేరుగా ఇంటికి వెళ్లకుండా నిడదవోలు తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ స్థానికంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా మొంథా తుఫాన్ తాజా పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం, పెరవలి, ఉండ్రాజవరం మండలాల తహసిల్దార్ కార్యాలయాల్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ల ద్వారా సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏ చిన్న సమస్య కూడా తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రకృతి విపత్తులు, వరదలు తలెత్తిన సమయంలో ఏ రకంగా స్పందించాలనే అంశంపై అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తూర్పుగోదావరి జిల్లాలోని ప్రతి గ్రామంలో ఏ తరహా చర్యలు చేపట్టాలన్న అంశంపై జిల్లా అధికార యంత్రాంగానికి ప్రత్యేక ప్రణాళికను నిర్దేశించామన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య కూడా తలెత్తకుండా అధికారులు, నాయకులు నిరంతరం అందుబాటులో ఉండి సమస్యలను పర్యవేక్షించాలని, ప్రజలకు బాసటగా నిలవాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ క్రమంలో ముందస్తు చర్యలపై అధికార యంత్రాంగానికి మంత్రి కందుల దుర్గేష్ దిశా నిర్దేశం చేశారు.

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తుఫాను వల్ల ఎలాంటి సమస్య లేదని, అధికారులు పూర్తిస్థాయి జాగ్రత్తలు చేపట్టారని వెల్లడించారు. ఈ సందర్భంగా రాబోయే రెండు మూడు రోజుల్లో తుఫాన్ పరిస్థితి అంచనా వేసుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశానని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

తుఫాన్ ధాటికి ఎక్కడైనా చెట్లు పడిపోవడం, స్తంభాలు విరిగి పడటం వంటి ఘటనలు కనిపిస్తే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా మార్గం సుగమం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 16 జెసిబిలు, 10 జనరేటర్లు, 17 ట్రాక్టర్లు, 14 వాటర్ ట్యాంకర్లు(రూరల్ లో పది, అర్బన్ లో నాలుగు), 5 ఈ వాటర్ ఎక్విప్మెంట్స్, 22 సెల్ ఫోన్ టవర్స్ ను ప్రభావిత ప్రాంతాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం కంట్రోల్ రూమ్ గా వ్యవహరిస్తుందన్నారు. 24/7 అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సమాచారం అందిస్తూనే, అందుబాటులో ఉంటారన్నారు. సమస్య ఎక్కడున్నా అధికారులు సత్వరమే స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చూపిస్తారని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వివరించారు.

ప్రజలను సురక్షిత మార్గాలకు తరలించడం, అవసరమైన వైద్య సేవలు అందించడం, భోజన, దాహార్తి అవసరాలు తీర్చడం వంటి విషయాల్లో పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. నిడదవోలులోని తన క్యాంప్ కార్యాలయ సిబ్బంది ఈ అంశాలను సమన్వయం చేస్తూ ఉంటారన్నారు. ఏ సమస్య వచ్చినా ఎదుర్కొనేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు భరోసా ఇచ్చారు.

ప్రతి ఏటా ఈ తరహా విపత్తులు సంభవిస్తూనే ఉన్నాయని, ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాన్ని అరికట్టవచ్చని మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని, దూర ప్రయాణాలు చేయకూడదని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ సూచించారు. జల కాలుష్యం జరిగే ప్రమాదం ఉందని, అంటువ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్న నేపథ్యంలో మంచినీటిని కాచి చల్లార్చి త్రాగాలని సూచించారు. చిన్నపిల్లలు ఉన్న తల్లిదండ్రులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వైద్యశాఖ అధికారులు అవసరమైన మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. హెల్త్ క్యాంపులు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మారుమూల గ్రామంలో ఇబ్బందున్నా కూడా సమాచారం అందిస్తే వైద్యులు వచ్చి సేవలందిస్తారని తెలిపారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించామని, పరిస్థితి ఉద్రిక్తమైతే సెలవులు పొడిగించే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, అత్యవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో ఉంచుతామన్నారు. పశువులను ఎత్తైన ప్రదేశాల్లో కట్టి ఉంచాలన్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండి ప్రభుత్వానికి సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కోరారు.

# తుఫాన్‌పై ప్రజలను తప్పుదారి పట్టించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ హెచ్చరిక వచ్చినప్పట్నుంచి సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా అలెర్ట్ అయిందని... గత మూడు రోజుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోందని మంత్రి అనిత వివరించారు. సీఎం చంద్రబాబుతో పాటు ఐటీ మంత్రి నారా లోకేష్, తాను ఆర్టీజీ సెంటర్ నుంచి సమీక్షలు నిర్వహించి అన్ని విభాగాలను అలెర్ట్ చేశామని... యంత్రాంగాన్ని సిద్ధం చేశామని అనిత చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సహా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేయడానికి అవసరమైన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేసిందని...జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో పాటు... తుఫాను సహాయక చర్యలకు అవసరమైన నిధులను విడుదల చేశారని వివరించారు. అలాగే కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసిన ప్రభుత్వం... మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా కూడా ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తోందని ఆ ప్రకటనలో హోం మంత్రి పేర్కొన్నారు.



**సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంయమనం పాటించాలి :** ఇలాంటి సమయంలో ప్రజలకు వేగంగా సమాచారాన్ని చేరవేసే సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు తుఫాను వార్తల కవరేజ్ విషయంలో సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని అనిత అభిప్రాయపడ్డారు. అయితే ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ప్లాట్ ఫార్మ్ లపై తుఫాను గురించి తప్పుడు ప్రచారాలు చేస్తున్నట్లు ప్రభుత్వ పరిశీలనలో తేలిందని ఆమె చెప్పారు. ఈ క్రమంలో కొన్ని యూ ట్యూబ్ చానళ్లు, డిజిటల్ మీడియా సంస్థలు పెట్టే థంబ్ నెయిల్స్ ప్రజలను భయపెట్టేలా ఉంటున్నాయని అన్నారు. సోషల్ మీడియా, డిజిటల్ మీడియాలో పెడుతోన్న కొన్ని థంబ్ నెయిల్స్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఉన్నాయని... ఈ మేరకు ఆర్టీజీ సెంటర్ నుంచి తమకు సమాచారం వచ్చిందని అనిత తెలిపారు. సంచలనాల కోసం పెట్టే తప్పుడు హెడ్డింగ్ లు, థంబ్ నెయిల్స్ కారణంగా ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొనే అవకాశం ఉందని ఆమె చెప్పారు. ఇది ప్రజల్లో అలజడికి కారణం అవుతుందని... ఈ నేపథ్యంలో తుఫాను విషయంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా కాకుండా.. వాస్తవాలకు అద్దం పట్టే విధంగా వార్తల కవరేజ్ చేయాలని ప్రభుత్వం సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలను అనిత కోరారు. సంచలనాల కోసం, వ్యూస్ కోసం ప్రజలను భయపెట్టేలా వ్యవహరించడం చట్ట విరుద్ధమన్నారు. అభూత కల్పనలు, అవాస్తవాలు, తప్పుదారి పట్టించేలా తుఫానుకు సంబంధించిన సమాచారం ప్రజల్లోకి వెళితే ఆ ప్రభావం ముంపు ప్రాంతాల ప్రజలు, వారి కుటుంబ సభ్యులుపై తీవ్రంగా ఉంటుందని...దీన్ని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని వాస్తవాలకు అద్దం పట్టేలా తుఫాను వార్తల కవరేజ్ ఉండాలని ప్రభుత్వం ఆయా సంస్థలను హోం మంత్రి కోరారు. ప్రజలకు సమాచారం చేరవేడంలో అత్యంత కీలకమైన పత్రికలు, టీవీ ఛానెళ్లతో పాటు.... సోషల్ మీడియా, డిజిటల్ మీడియా మరింత జాగ్రత్తగా, బాధ్యతగా వార్తలు ప్రజలకు చేరవేయాలని హోం మంత్రి అనిత తెలిపారు.

# ఆస్తి, ప్రాణం మష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

○ **అధికారులు ఆదేశించిన ఎమ్మెల్యే, కమిషనర్**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)** :మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న 3 రోజుల్లో తీవ్ర గాలులతో కూడిన భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగరంలో ఆస్తి , ప్రాణ నష్టం జరగకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో మొంథా తుఫాన్ వలన ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నియోజకవర్గ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, మొంథా తుఫాన్ నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 72 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిలో 29 తూర్పు నియోజకవర్గంలో ఉన్నాయన్నారు. తూర్పు నియోజకవర్గంలోని కేంద్రాల్లో షుమారు 10వేల మంది వరకు వసతి కల్పించడానికి వీలుందన్నారు. ఇప్పటికే వార్డ్ ల వారీగా నోడల్ అధికారులను అప్రమత్తం చేశామని, అధికారులు, సచివాలయ కార్యదర్శులకు సెలవులు రద్దు చేశామని తెలిపారు. పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలకు తీసుకురావడంలో స్థానిక కార్పొరేటర్లు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఎక్కడ సమస్య తలెత్తినా తక్షణం జిఎంసి కమాండ్ కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించాలని సూచించారు.

శాసన సభ్యులు నసీర్ మాట్లాడుతూ తుఫాన్ ని ఎదుర్కోవడానికి కమిషనర్ నేతృత్వంలో రూపొందించిన యాక్షన్ ప్లాన్ ప్రణాళికాబద్దంగా ఉందని, సదరు ప్లాన్ మేరకు క్షేత్ర స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. పునరావాస కేంద్రాల్లో సమగ్ర మౌలిక వసతులు, ఆహారం, త్రాగునీరు అందించడం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తూర్పు నియోజకవర్గంలో ప్రస్తుతం లోతట్టు ప్రాంతాలు గుర్తించిన వాటితోపాటు గత అనుభవాల దృష్ట్యా మరికొన్ని ప్రాంతాలపై కూడా శ్రద్ధ చూపాలని, వాటిని కూడా లిస్టు లో చేర్చాలన్నారు. విద్యుత్, ఇతర శాఖల అధికారులు కూడా 3 రోజులు అప్రమత్తంగా ఉండాలని, జిఎంసి అధికారులు పారిశుధ్యం, పూడికతీత, పునరావాస కేంద్రాల ఏర్పాటుకు భాధ్యతగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, గుంటూరు తూర్పు తహశీల్దార్ సుభాని, కార్పొరేటర్లు, అధికాలరు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# టెట్ నోటిఫికేషన్‌పై ఉపాధ్యాయ లోకం ఆందోళన
# సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** టెట్ నోటిఫికేషన్‌పై ఉపాధ్యాయ లోకంలో నెలకొన్న ఆందోళనను పరిష్కరించాలంటూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సోమవారం ఉదయం 11 గంటలకు అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణను వారి స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న సమయంలో విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్‌లో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను కూడా సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో టెట్ పరీక్షకు అప్లై చేసుకోవాలని పేర్కొనడం వల్ల ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వడానికి అన్ని అవకాశాలను ప్రభుత్వం పరిశీలించాలని కోరారు.

ఈ సందర్భంగా ఏఎస్ రామకృష్ణ స్పందిస్తూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని, ఉపాధ్యాయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.భాస్కరరావు, అసోసియేట్ అధ్యక్షుడు పి.లలిత బాబు, రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర అధ్యక్షుడు కె.వి.రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎ.హరగోపాల్, టి.రవి తదితరులు పాల్గొన్నారు.

# స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించి, రైతు సంక్షేమానికి మద్దతుగా నిలిచిన చిరెక్ స్కూల్ విద్యార్థులు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ లోని చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ 12వ తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు పట్టణ తరగతి గదుల నుండి గ్రామీణ ప్రాంతాలకు దృష్టి మళ్ళించారు. చాలా మంది విద్యార్థులు వారంతాల్లో విద్య, విశ్రాంతి కోసం గడుపుతుండగా, శృతిక రెడ్డి, సబ్జారెడ్డి, కార్తిక్ రెడ్డి, యోచిత్ చెరుకూరి అనే విద్యార్థులు వేరే మార్గాన్ని ఎంచుకున్నారు. వారు పట్టణ ఆవిష్కరణ మరియు గ్రామీణ వ్యవసాయం మధ్య అంతరాన్ని తగ్గించటానికి ఒక స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని ప్రారంభించారు. స్థిరమైన వ్యవసాయం మరియు రైతు సంక్షేమాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో, ఈ విద్యార్థి బృందం కడప, నెల్లూరు జిల్లాలలోని అనేక ప్రధాన గ్రామాల్లో పర్యటించారు. నేల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రైతులతో సంభాషించారు. వ్యవసాయ సంస్కరణలపై ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారు.

ఈ బృందం కడప మరియు నెల్లూరు జిల్లాల్లోని 12 గ్రామాలలో చురుకుగా పనిచేసింది. ఎక్కువ మంది రైతులను కలిసి నేల సంరక్షణ, సేంద్రీయ పద్ధతులు మరియు ప్రభుత్వ మద్దతు పథకాలపై అవగాహన పెంచింది. ప్రత్యక్షక్షేత్ర సందర్శనలు మరియు స్థానిక వ్యవసాయ అధికారులతో చర్చల ద్వారా, అగ్రినోవా రైతులకు పంట భ్రమణం, కంపోస్టింగ్ మరియు తక్కువ ఖర్చుతో కూడిన, పర్యావరణ అనుకూల వ్యవసాయ ప్రత్యామ్నాయాలను బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడింది.

ఆన్-గ్రౌండ్ ప్రయత్నాలతో పాటు, ఈ బృందం హైదరాబాద్ శివార్లలోని సేంద్రీయ పొలాలను సందర్శించి, అక్కడ వారు సహజ వ్యవసాయ పద్ధతులను స్వయంగా అధ్యయనం చేసారు. కంపోస్టింగ్, పంట భ్రమణం నుండి పర్యావరణ అనుకూల తెగులు, నియంత్రణ పద్ధతుల వరకు సహజ వ్యవసాయ పద్ధతులు నేర్చుకున్నారు. వారు స్థిరమైన వ్యవసాయం మరియు గ్రామీణాభివృద్ధిపై అంతర్దృష్టులను పంచుకుంటూ ఆన్‌లైన్‌లో పెద్ద సంఖ్యలో ప్రేక్షకులను చేరుకోవడానికి డిజిటల్ అవగాహన ప్రచారాలను కూడా నిర్వహించారు.

పరిశోధన, ఫీల్డ్ వర్క్ మరియు డిజిటల్ ఔట్రీచ్‌లను కలపడం ద్వారా, అగ్రినోవా యువత ఆధారిత కార్యాచరణకు చిహ్నంగా మారింది. విద్యార్థులు పట్టణ ఆవిష్కరణ మరియు గ్రామీణ స్థితిస్థాపకత మధ్య అంతరాన్ని ఎలా తగ్గించవచ్చో చూపించారు. వ్యవస్థను అధ్యాయనం చేయడమే కాకుండా, దానిని ప్రాథమిక స్థాయి నుండి అర్థం చేసుకోవడమే మా లక్ష్యం అని ఈ విద్యార్థుల బృందం చెబుతుంది. "మాలాంటి యువతను గ్రామీణ బారత దేశ మూలాలకు అనుసంధానించి నేర్చుకోవడం, సహకరించడం మరియు వ్యవసాయరంగం లోకి కొత్త ఆలోచనలు తీసుకురావాలని మేము కోరుకున్నాము" అని విద్యార్థులు శృతిక రెడ్డి, సబ్జా రెడ్డి, కార్తిక్ రెడ్డి, యోచిత్ చెరుకూరి చెప్పారు.

# ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కోసం రివ్యూ పిటిషన్ వేయాలి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నుంచి మినహాయించాలని, ఆ దిశగా ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర నాయకులు అభ్యర్థించారు.

ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఎ జి ఎస్ గణపతి రావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాష్ రావు లేఖ ద్వారా మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు తెలిపారు సుప్రీం కోర్టు 2025 సెప్టెంబర్ 1న వెలువరించిన తీర్పు ప్రకారం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రస్తుత ఉపాధ్యాయులు, రిటైర్మెంట్‌కు ఐదు సంవత్సరాల లోపు ఉన్నవారిని మినహాయించి, మిగతా అందరూ రెండు సంవత్సరాల్లో టెట్ ఉత్తీర్ణత పొందాలని పేర్కొంది.

ఈ నేపథ్యంలో పలు రాష్ట్రాలు, ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయని, కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటివరకు రివ్యూ పిటిషన్ వేయలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. టెట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర అస్వస్థత నెలకొన్నదని ఆప్టా నాయకులు తెలిపారు.

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ప్రయోజనాలను రక్షించడానికి ప్రభుత్వమే ముందుకు వచ్చి తక్షణమే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని వారు కోరారు. ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, బాధ్యత తీసుకుని విద్యా రంగానికి స్థిరత్వం తీసుకురావాలని ఆప్టా నేతలు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# మండల స్థాయిలో విపత్తు స్పందన బృందాలు

- గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా నిరంతరం అప్రమత్తం
- తుపాను జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించండి
- ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకూడదు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**

మొంథా తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా మండల స్థాయిలో విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా సిబ్బంది పటిష్ట సమన యంతో, ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. ఆదివారం కలెక్టర్ లక్ష్మీశ.. ఆర్‌డీవోలతో పాటు రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పౌర సరఫరాలు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా నదితో పాటు వాగులు వంకల్లో నీటి ప్రవాహాలను పర్యవేక్షిస్తూ.. అటువైపు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. వర్షాలు, గాలుల సమయంలో ప్రయాణాలు చేయకుండా



అవగాహన కల్పించాలని.. పశువులను చెట్ల కింద, స్తంభాలతో కట్టకుండా చూడాలని పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సహా యసహకారాలు అందించేందుకు సిద్ధం గా ఉండా లన్నారు. వైద్య సంరక్షణ అవసరమైన రోగులు, గర్భిణీలను సమీప ఆసుప త్రుల్లో చేర్చాలని సూచించారు. అధికారు లు, సిబ్బంది 24X7 పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని.. ఏదైనా అత్యవర పరిస్థితి ఉంటే కమాండ్ కంట్రోల్ కేంద్రం (91549 70454)కు నివేదించాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవి ధంగా శిథిలావస్థలో ఉన్న భవంతులను గుర్తించి అందులో ఎవరూ ఉండకుండా.. పునరావాస శిబిరాలక ు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. చేపల వేటకు నదిలోకి మత్స్యకారులు వెళ్లకుండా ఆయా గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీచేయాలన్నారు. ఒకవేళ చెట్లు, స్తంభాలు ఎక్కడైనా పడిపోతే వెంటనే తొలగించేందుకు అవసరమైన సామగ్రిని అందు బాటులో ఉంచుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకో వాలన్నారు. విధుల నిర్వహణలో నిబద్ధత, నిరంతర అప్రమత్తతే ప్రజల భద్రతకు భరోసానిస్తుందని.. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. టీసీలో విజయవాడ ఆర్‌డీవో కావూ రి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి తదితరులు పాల్గొన్నారు.

**తుపాను కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఫోన్ నెంబర్లు**

కలెక్టర్ కార్యాలయం (91549 70454)
విజయవాడ ఆర్డీవో కార్యాలయం: 0866 2574454
నందిగామ ఆర్డీవో కార్యాలయం: (78930 53534)
తిరువూరు ఆర్డీవో కార్యాలయం: (83098 36215, 08673251235)

# స్కేటింగ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన చిన్నారులు

- గెలుపొందిన స్కేటర్లకు పతకాలు ప్రధానం

**గన్నవరం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**

కృష్ణాజిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలు గన్నవరం మండలం పురుషోత్తపట్నం రోడ్డులోని హరివిల్లు వెంచర్లో నిర్వహించారు. కృష్ణాజిల్లా స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 2025, దీనిని రోలర్–స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్.ఎస్.ఎఫ్.ఐ), ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ (ఏపీ.ఆర్.ఎస్.ఏ) గుర్తించాయి. ఈ ఛాంపియన్‌షిప్ 2025 అక్టోబర్ 11 నుండి 2025 అక్టోబర్ 13 వరకు జరిగాయి. గన్నవరం కేసరపల్లికి ప్రాతినిధ్యం వహిస్తున్న టీమ్ స్టార్స్ ఆన్ వీల్స్ ప్రతిభ దృఢ సంకల్పానికి అద్భుతమైన ప్రదర్శనగా నిరూపించబడింది. వారి అంకితభావంతో కూడిన కోచ్ నాని మార్గదర్శకత్వంలో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 14 మంది ఉత్సాహభరితమైన స్కేటర్లు, 9 మంది యువ స్కేటర్లు ఈ సందర్భానికి



తగినట్లుగా ఎదిగి పోడియం ఫినిషింగ్‌లను సాధించారు. అద్భుతమైన పతకాలను సాధించారు. ఈ పాతకాలను విజయవాడ గాంధీనగర్ లో గల %ూ ూ% ఫిలిమ్ ఛాంబర్ అఫ్ కామర్స్ హాల్లో విజేతలకు బహుమతులు అంద చేశారు లోని ఈ జట్టు బహుళ విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శనలను అందించింది. గట్టి పోటీని ఎదుర్కొని ఈవెంట్ అంతటా నిజమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించింది. అనంతరం స్కేటింగ్ లో పాల్గొన్న చిన్నారులు మరియు వారి తల్లి తండ్రులు పోటీలు నిర్వహించిన హరివిల్లు వెంచర్ లో కోచ్ నాని తో కలసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మెడల్స్ గెలిచిన చిన్నారుల తల్లితండ్రులు కోచ్ నానికి కృతజ్ఞతలు తెలిపారు.

**పతక విజేతలు..**

రుషిల్ (రజతం, కాంస్య, కాంస్య),మోక్షిత (బంగారం, వెండి, కాంస్య)ఆరోన్ (రజతం), అర్ష (2 కాంస్య),ఆయన్ (బంగారం, కాంస్య),కార్తికేయ (2 కాంస్య),అనన్య (2 రజతం), జ్ఞాన్విక (కాంస్య), శాన్విక (రజతం) పతకాలు సాధించి పలువురు మన్ననలను పొందారు.

## రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలలో
# ఐడీపీఎస్ విద్యార్థుల విజేత ప్రదర్శన

**తాడేపల్లిగూడెం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏలూరులో జరిగిన రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో తాడేపల్లిగూడెంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఘనవిజయం సాధించారు. తొమ్మిదో తరగతి విద్యార్థి ప్రశాంత్ మృదుల్ అద్భుత ప్రతిభ కనబరిచి 500 మీటర్లు మరియు 3000 మీటర్ల ఈవెంట్లలో రెండు బంగారు పతకాలు సాధించాడు.అదే విధంగా రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో కూడా ఐడిపిఎస్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రశాంత్ మృదుల్ ఈ పోటీల్లో కూడా మొత్తం మూడు పతకాలను ఒక బంగారు, రెండు రజత పతకాలు గెలుచుకున్నారు. మూడో తరగతి విద్యార్థిని సహస్ర కఠినమైన 1000 మీటర్ల రోలర్ స్కేటింగ్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించి తన ప్రతిభను చాటింది. పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా శ్రీనివాస్ విద్యార్థులను అభినందిస్తూ, వారి కృషి, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# శ్రీకాళహస్తిలోని దేవస్థానం నూతన పాలకమండలిచైర్మన్ గా కొట్టేసాయిప్రసాద్ ప్రమాణ స్వీకారం





**శ్రీకాళహస్తి, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**

శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ గా ఎన్నికైన కొట్టేసాయి ఆదివారం పాలకమండలి ప్రమాణస్వీకారానికి శ్రీకాళహస్తి భాస్కర్ పేట నుంచి భారీ ర్యాలీతో శ్రీకాళహస్తి దేవస్థానం తరలివచ్చారు శ్రీకాళహస్తిలోని దేవస్థానం నందు నూతన పాలకమ ండలి చైర్మన్. గా కొట్టేసాయిప్రసాద్ మరియు పాలక మండల సభ్యులుగా 15మంది ఆలయ ఈవో బాపిరెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి దేవస్థానానికి నూతనంగా ఎన్నికైన పాలకమండలి కమిటీకి ప్రమా ణ స్వీకారం చేసిన చైర్మన్ మరియు కమిటీ సభ్యులకు అభినందనలు తెలియ జేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పినట్లుగా ఒకరినొకరు గౌరవిం చుకుంటూ ఏ పని చేసిన దేశం కోసం చేయాలని స్ఫూర్తితో నేడు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలియజేశారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తు భక్తులకు కల్పించిన సౌకర్యాల కోసం ఒక కొత్త ఆలోచనతో ముందుకు పోతుందని. అదేవిధంగా సనాతన ధర్మాలు కాపాడేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని. ఇక రాష్ట్ర అభివృద్ధికి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎనలేని కృషి చేస్తున్నారని తెలియజేశారు. శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలిగా నియమి తమైన చైర్మన్ మరియు సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని తిరుమలలో ఏ విధంగా భక్తులకి సౌకర్యాలు కల్పిస్తారో అదేవిధంగా శ్రీకాళహస్తి దేవస్థానంలో కూ డా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కనిపిస్తే ఆలయ అభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా లభించే విధంగా పాలకమండలి కృషి చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవ స్థానం నూతన పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి దేవస్థానం ఆల య అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తామని తెలియ జేశారు, . రానున్న మహాశివరాత్రి అత్యంత వైభవం గా నిర్వహించడానికి కార్యాచరణ చేపడతామన్నారు.



# ఘనంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు జన్మదిన వేడుకలు

**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**

ఘనంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు వడ్డెర జాతి ఆశాజ్యోతి వడ్డెర కుల బంధువులకు అన్ని వేళలా అందుబాటులో ఉండే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలో కేక్ కటింగ్ నిర్వహించి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వడ్డెర డైరెక్టర్ జె మహాలక్ష్మి మాట్లాడుతూ వడ్డెర జాతి ఆణిముత్యం అయినటువంటి మల్లె ఈశ్వరరావు కు ఆ భగవంతుడు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు.ఈ సందర్భంగా టిఎన్టియుసి నాయకులు బూరుసు శివ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువ మెజారిటీలో ఉన్న వడ్డెర్లు కు రాజకీయ చైతన్యం కల్పించాలి అన్నారు.ఈ సందర్భంగా వడ్డెర ఉద్యోగ సంఘం నాయకులు పల్లపు శ్రీనివాస్ మాట్లాడుతూ యువతలో చైతన్యం రావాలి వడ్డెర జాతి బిడ్డలకు మనం ఇచ్చే ఆస్తి ఏదయినా ఉంది అంటే అది చదువు ఒక్కటే చదువు ఉంటే ఉద్యోగం రాజకీయం గా మనం ముందుకు వెళ్ళగలకుందాం అన్నారు.ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇర్ల దుర్గారావు, గుంజ శ్రీనివాస్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ జె.మహాలక్ష్మి వడ్డెర సంఘ పెద్దలు మున్సిపాలిటీ వడ్డెర సంఘం నాయకులు,వడ్డెర ఉద్యోగ సంఘం,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గండ్లును పూడ్చి రోడ్డు మరమ్మతులు చేయించిన డిసి చైర్మన్ రాపర్ల బాలకృష్ణ

**నూజివీడు, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**



ఏలూరు జిల్ల నూజివీడు డీసీ చైర్మన్ చొరవతో కాల్వ గండి సమస్య పరిష్కారం ముసునూరు మండలంలోని కొర్లగుంట శివారు తాళ్ళవల్లి మీదుగా తుక్కులూరు, నూజివీడు వెళ్లే రహదారిలో గుర్రాలమ్మ–గుర్రాలయ్య గుడి సమీపంలో గత కొన్ని రోజులుగా నాగార్జున సాగర్ కాలువ వంతెన వద్ద గండ్లు పడి రోడ్డు అస్తవ్యస్తంగా మారి పోయింది.దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.ఈ విషయాన్ని గుర్తించిన డి సి చైర్మన్ రాపర్ల బాలకృష్ణ చొరవ తీసుకుని ఇరిగేషన్ అధికారులకు సమస్య తీవ్రతను వివరించారు. స్పందించిన అధికారులు ఆదివారం గండి పూడ్చించి రోడ్డు బాగు చేయించారు. చొరవ చూపిన బాలకృష్ణకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## నవంబర్ 1న హైదరాబాదులో
# దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన



**గన్నవరం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్ మీద దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాదులో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన లక్షలాదిమందితో జరుగుతుందని గన్నవరం నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఎం.ఎస్.పి ఇంచార్జ్ మంద వేణు మాదిగ అన్నారు గన్నవరం నియోజకవర్గ స్థాయి సమావేశం స్థానిక సిఎస్ఐ కమ్యూనిటీ హాల్ లో జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఏ వ్యవస్థ ముందుకు రాకపోవడం అత్యంత ఆందోళనకరణ అంశమని దాడికి గురైన వ్యక్తి దళితుడైనందువలన ఏ వ్యవస్థ ముందుకు రావట్లేదని దళితులు ఏ స్థాయిలో ఉన్న వివక్ష తప్పదని ఏ విభక్షణ ఎదుర్కోవటం దళితుల ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని అందుకోసమే హైదరాబాదులో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన విజయవంతం చేయాలని అందుకు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ పి మండల ఇంచార్జ్ కోర్టిగడ్డ దేవదాసు మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు తగరం విజయకుమార్ మాదిగ బహునెల తిరుపతిరావు పరస చైతన్య కంతేటి జనార్దన్ రావు ఉయ్యూరు రమేష్, తదితరులు మీటింగ్ లో పాల్గొన్నారు.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్)**

ఘనంగా ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు వడ్డెర జాతి ఆశాజ్యోతి వడ్డెర కుల బంధువులకు అన్ని వేళలా అందుబాటులో ఉండే వ్యక్తి ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా కొండపల్లి మున్సిపాలిటీ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలో కేక్ కటింగ్ నిర్వహించి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వడ్డెర డైరెక్టర్ జె మహాలక్ష్మి మాట్లాడుతూ వడ్డెర జాతి ఆణిముత్యం అయినటువంటి మల్లె ఈశ్వరరావు కు ఆ భగవంతుడు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు.ఈ సందర్భంగా టిఎన్టియుసి నాయకులు బూరుసు శివ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువ మెజారిటీలో ఉన్న వడ్డెర్లు కు రాజకీయ చైతన్యం కల్పించాలి అన్నారు.ఈ సందర్భంగా వడ్డెర ఉద్యోగ సంఘం నాయకులు పల్లపు శ్రీనివాస్ మాట్లాడుతూ యువతలో చైతన్యం రావాలి వడ్డెర జాతి బిడ్డలకు మనం ఇచ్చే ఆస్తి ఏదయినా ఉంది అంటే అది చదువు ఒక్కటే చదువు ఉంటే ఉద్యోగం రాజకీయం గా మనం ముందుకు వెళ్ళగలకుందాం అన్నారు.ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపాలిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇర్ల దుర్గారావు, గుంజ శ్రీనివాస్, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ జె.మహాలక్ష్మి వడ్డెర సంఘ పెద్దలు మున్సిపాలిటీ వడ్డెర సంఘం నాయకులు,వడ్డెర ఉద్యోగ సంఘం,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యువకులు, మహిళలారా కాంగ్రెస్‌ను నిలదీయండి



## మన్‌కీబాత్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 27 (జర్నలిస్ట్‌ఫైల్):** మహిళా రుణాలను అడ్డు కుంటున్న, నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తానన్న కాంగ్రెస్‌ను యువత, మహిళలు నిలదీయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని వెంకటగిరి ఆఫీసర్స్ కాలనీలో ప్రధాని 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనసులోని మాటలను, ఆలోచనలను దేశ ప్రజలతో మన్ కీ బాత్ ద్వారా పంచుకుంటున్న ఏకైక నాయకుడు దేశ ప్రధాని మోదీ ఒక్కరేనన్నారు. దేశ గొప్పతనం, సంస్కృతి, త్యాగాల గురించి ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని వివరిస్తున్నారన్నారు. 11 యేళ్లుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశ ప్రగతిని ముందుకు తీసుకెళ్తున్న వ్యక్తి అని అన్నారు. 140 కోట్ల మంది భారతీయులను ఏకం చేసిన వ్యక్తి అని, కొవిడ్ సమయంలోనే ఇది నిరూపితమైందన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ అనేక వాగ్దానాలు ఇచ్చిందని, కేసీఆర్ డబుల్ బెడ్ రూం పేరుతో మోసం చేశారని, పొదుపు సంఘాలకు డబ్బులు ఇవ్వలేదన్నారు. నాటి బీఆర్ఎస్ పాలనలో జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో కబ్జాలు, అక్రమాలు, రౌడీయిజం, నేరాలు పెరిగాయన్నారు. ప్రజలను, నాయకులను, విలేకరులను వేధించారన్నారు. పొంగుతున్న రోడ్లు, తాగునీరు లేని బస్తీలు ఈ నియోజక వర్గంలో కనిపిస్తున్నాయన్నారు.

కేసీఆర్ ఫాంహౌజ్‌లో పడుకొని ఓట్లు అడుగుతున్నారని, ఇక్కడ గల్లీల్లో, చెత్త కుప్పల్లో తిరుగుతూ ఓట్లు అడగాలని, ప్రజలు పడుతున్న బాధలు తెలుస్తాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అయిదు లక్షల రూపాయల రుణాలు ఇస్తామని విద్యార్థులకు మోసం చేసిందని, దళిత కుటుంబానికి రూ. 12లక్షలను ఇచ్చారా అంటూ ప్రశ్నించారు. బీసీ సంక్షేమానికి కేటాయించిన లక్ష కోట్లు ఏమయ్యాయి అంటూ ప్రశ్నించారు. వీటిపై ప్రజలు ఆయా నాయకులను నిలదీయాలన్నారు. మజ్లిస్ కబంధహస్తాల నుంచి నగరాన్ని కాపాడుకోవాలని, ఇందుకోసం బీజేపీని గెలిపించాలని కోరారు. రేవంత్‌రెడ్డి హామీల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

# 'గోవులు విశ్వానికే తల్లి' సూక్తిని నిజం చేసుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** గోవులు విశ్వానికే తల్లి అనే సూక్తిని నిజం చేసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని కేయంఐటి లోగో సేవ తెలంగాణ విభా గం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి తెలంగాణ ప్రాంత గో విజ్ఞాన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పురస్కాలు ప్రధాన చేసి ప్రసంగించారు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన నాకు గోమాత పట్ల ప్రత్యేకమైన గౌరవం, వాటి రక్షణ పట్ల అవగాహన ఉంది. అలాగే, గోవుల వల్ల సమాజానికి చేకూరే అపారమైన లాభాలు నాకు పూర్తిగా తెలుసు. గోవులు కేవలం పాలను మాత్రమే కాకుండా, వాటి శ్వాస, ఉచ్ఛ్వాసల మధ్య గడిపే సమయం మనిషిలోని సగం ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తుందని అన్నారు. ఎప్పుడూ అధికారిక కార్యక్రమాలతో బిజీగా ఉండే ఆయన, తన నివాసంలో గోవులను పెంచుకుంటూ, వాటితో గడిపే సమయం వల్ల మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను దూరం చేసుకుంటున్నానని చెప్పారు. ఇది గోవుల ప్రాముఖ్యతకు ఒక మంచి ఉదాహరణ. అని అన్నారు. దురదృష్టవశాత్తు, వ్యవసాయ క్షేత్రాలు, తగ్గిపోవడం వలన గోవుల స్వేచ్ఛకు గండి పడిందనీ, . ఒకప్పుడు పచ్చిక బయళ్లలో స్వేచ్ఛగా తిరిగే అవి, ఇప్పుడు ఇరుకు స్థలంలో కట్టిపడేయబడుతున్నాయన్నారు. .గోవుల రక్షణ కేవలం గో పరిరక్షకుల బాధ్యత మాత్రమే కాదు, మొత్తం సమాజానిదే నని అన్నారు. గోవుల వ్యర్థాలతో వ్యవసాయం చేయడం ద్వారా భూమి సారాన్ని పెంచుతున్నాయనీ అన్నారు. రోజు గో సేవ విభాగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అద్భుతమైన కార్యక్రమంలో, తల్లిదండ్రులను, వారి పిల్లలను భాగస్వామ్యం చేస్తున్నందుకు ఆనందంగా ఉంది అని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా పాల్గొన్నారు.

# నైవేలీ లిగ్నైట్ సిఎండి ప్రసన్నకు అబ్దుల్‌కలాం పురస్కారం

**హైదరాబాద్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌సిఎల్) ఇండియా లిమిటెడ్ సిఎండి మోటుపల్లి ప్రసన్నకుమార్ డాక్టర్ అబ్దుల్ కలాం జీవిత సాఫల్య పుస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఆదివారం జరిగిన అబ్దుల్ కలాం జయంతి వేడుకల్లో భాగంగా ప్రసన్నకుమార్‌కు ఈ పురస్కారం ప్రదానం చేశారు. ప్రసన్న కుమార్ దార్శనిక నాయకత్వం, ఆదర్శప్రాయమైన సేవ, ఆవిష్కరణ, జాతీయ వృద్ధికి అచంచలమైన నిబద్ధతను గుర్తిస్తూ ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. విలువలు, చురుకైన నాయకత్వంలో ఎన్‌సిఎల్ పునరుత్పాదక ఇంధన విస్తరణ, స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక పరివర్తనపై బలమైన దృష్టితో ఇంధన, మైనింగ్ రంగాలలో అద్భుతమైన పురోగతిని సాధించింది. విక్సిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా, పర్యావరణ అనుకూలమైన సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహిస్తూ ఆయన చొరవలు భారతదేశ ఇంధన భద్రతను గణనీయంగా బలోపేతం చేశాయి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం జాతీయ పురోగతి, పారిశ్రా మిక ఆవిష్కరణలు పర్యావరణ నాయకత్వానికి అపారమైన కృషి చేశారన్నారు.

# అన్నదాతకు తుఫాన్ గండం

## ఆరుగాలం శ్రమ వర్షార్పణం

**హైదరాబాద్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తుఫానుగా మారడంతో అన్నదాత గుండెల్లో గుబులు రేపుతోంది. తెలంగాణ వ్యాప్తంగా ఒక కోటి 63వేల ఎకరాలలో సాగుచేసిన ఆహార పంటలు, వాణిజ్య, చేతికి అందుతున్న తరుణంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. పసుపు, కూరగాయలు, పండ్లు వంటి తోటలకు కూడా సుదీర్ఘవర్షంతో చీడపీడలు సోకిరైతుకు అనిశ్చితికి గురిచేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ జిల్లాలో సాంప్రదాయ పంటలు 1,29,62,000లో సాగు చేసిన వరి, పత్తి, సోయా, మొక్కజొన్న, కందులు, పెసర, మినుములు, తదితర పంటల కోతలు పూర్తి కావడంతో కేంద్రాల్లో విక్రయించుకునేందుకు పొలాల్లో, రోడ్లపై ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నారు. పంట ఉత్పత్తుల విక్రయాల్లో తేమతోనే ధర నిర్ధారణ చేస్తారు. తేమను తగ్గించేందుకు రైతులు పంటను ఆరబెట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటే. మరోవైపు మబ్బులతో కూడిన వాతావరణం రైతుల గుండెల్లో గుబులురేపుతోంది. కొంత మంది రైతులు సోయాను కోసి, నూర్పిడికి కుప్పలు వేసి ఉంచారు. పంట ఇంటికి రాక ముందే వర్షాలు కురుస్తుండటంతో టార్పాలిన్ కవర్లు కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నంలో ఉన్నారు. తెలంగాణలో వరి 67.30లక్షల ఎకరాలలో, 45.94 లక్షలలో పత్తి పంటను సాగు చేశారు.కోటి యాభైలక్షల వరిధాన్యం దిగుబడిఅవుతుందని అంచనావేశారు. మూడు దశల్లో పత్తిని ఏరి మార్కెట్‌కు విక్రయానికి తీసుకొస్తారు. 36,75,774 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి అవుతుందని అంచనా వేసినా ప్రతికూల వాతావరణంతో దిగుబడి పూర్తిగా తగ్గి కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. సెప్టెంబరు నుంచి నిరంతరం వర్షం కురుస్తుండటంతో పత్తి కాయలు నేలరాలిపోతున్నాయి. కొన్ని కుళ్లిపోతున్నాయి. ఏరని పత్తి మొక్కలపైనే తడిసి పసుపురంగులోకి మారుతోంది.పత్తి కాయలు విచ్చుకోకుండా అలాగే ముద్ద అవుతోంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో పత్తిలో తేమ 27శాతం ఉంటున్నది. కాటన్‌కార్పొరేషన్ ఇండియా పత్తిలో తేమ 12 శాతం లోపు ఉంటేనే కొనుగోలు చేస్తుంది. పత్తికి మద్దతు ధర క్వింటాల్‌కు 8100 ఉన్నప్పటికి తేమ, డిస్‌కలర్, స్టేపుల్ లెంథ్ 31ఎం.ఎం వంటి ప్రమాణాలకు తూగకపోవడంతో ఐదు నుంచి ఆరువేల రూపాయలు కూడా ధర వచ్చే పరిస్థితి లేదు. మొక్కజొన్న రాష్ట్రంలో ఆరులక్షల44వేల ఎకరాలలో సాగుచేశారు. 12లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేశారు కానీ అయితే వర్షం కారణంగా మొక్కజొన్నలో సగటు నాణ్యతాప్రమాణాల ప్రకారం 14శాతంలోపే తేమ ఉండాలి కానీ ఇందులో కూడా 21శాతం మేరకు తేమ ఉండటంతో కనీసమద్దతు ధర 2400 రావడంలేదు. నాలుగులక్షల90వేల ఎకరాలలో సాగుచేసిన కందులు, 61వేల ఎకరాలలో సాగుచేసిన పెసరపంట, 28వేల ఎకరాలలో సాగైన మినుములు, పదివేల ఎకరాలలో సాగుచేసిన వేరుశనగ , 36వేల ఎకరాలలో పండించిన జొన్నలు పంటల పై పూర్తిగా ఆశ వదులు కొన్నారు. మరో వైపు సోయా 3,62 372 ఎకరాలలో సాగు చేశారు. నిజామాబాద్ నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలో కొనుగోళ్లను ఇంకా ప్రారంభించకపోవడంతో రైతులు మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నారు. వర్షాలు పడుతుండటంతో అన్ని పంట దినుసులలో 20 నుంచి 27 శాతం తేమ ఉంటున్నది. తెలంగాణలో అన్ని పంటలు మొలకలు వస్తున్నాయి.

# వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

## మలేరియా, డెంగ్యూల నుంచి జాగ్రత్తగా ఉండాలి

## ప్రజలకు వైద్య, ఆరోగ్య శాఖ సూచన

**హైదరాబాద్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాబోయే మూడు రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రత తగ్గడం, తేమ ఎక్కువగా ఉండనుంది. ఈ నేపథ్యంలో కాలానుగుణ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ పలు సూచనలు చేసింది. ముఖ్యంగా వెక్టర్, నీరు, గాలి ద్వారా సంక్రమించే వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని. వాటినుండి రక్షణ కోసం, ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండటానికి మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యాలను ఎదుర్కోవడానికి దోమల ముప్పును ఎదుర్కోవాలని సూచించారు. కిటికీలకు దోమతెరలను ఏర్పాటు చేసుకొని భద్రంగా ఉండాలని ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ వి రవీందర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ముందుజాగ్రత్తగా దోమల నివారణ మందులను వాడాలని సూచించారు.

నీరు నిలిచిపోకుండా నిరోధించడానికి గృహ కాలువలను వాడాలన్నారు. దోమల వృద్ధిని నివారించడానికి గృహ సెప్టిక్ ట్యాంకులను మెష్‌తో కప్పాలని, ఇంటి చుట్టూ నిలిచిన నీటిని తొలగించడానికి ప్రతి వారం "శుక్రవారం డ్రై డే" పాటించాలన్నారు. నీటి ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్లను నివారించాలని.. తీవ్రమైన గ్యాస్ట్రోఎంటెరిటిస్, కామెర్లు, టైఫాయిడ్ రాకుండా ఫిల్టర్ చేసిన, మరిగించిన నీటిని త్రాగాలని సూచించారు. ముఖ్యంగా బయట ఆహారాన్ని తినకుండా ఉండాలన్నారు. గాలి ద్వారా వచ్చే వైరల్ జ్వరాలు, ఇన్ఫ్లుఎంజా, అనారోగ్యంతో ఉన్న వారితో కరచాలనం చేయవద్దన్నారు. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ఉండటానికి తరచుగా హ్యాండ్ శానిటైజర్లను వాడాలన్నారు. తుమ్మినప్పుడు లేదా దగ్గినప్పుడు చేతి రుమాలు వాడాలని, ఎవరికైనా ఫ్లూ లాంటి లక్షణాలైన జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, సంబంధిత శరీర నొప్పులతో కూడిన దగ్గు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలన సూచించారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితిలో 108 అంబులెన్స్ సేవలకు కాల్ చేయాలని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా, అన్ని ప్రజారోగ్య కేంద్రాలలో ప్రత్యేక పడకలు, ఐవి ఫ్లూయిడ్లు, అవసరమైన మందులను అందించడం ద్వారా ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లు చేసిందని డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు.

# 111 ఆదివాసీ జంటలకు ఒకే వేదికపై పెళ్లిళ్లు

## నల్లమల ఆదివాసీలను మరోసారి కలుస్తా

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ



నూతన వధువరులకు వివాహ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** అడవులను నమ్ముకొని జనజీవనానికి దూరంగా జీవిస్తున్న ఆదివాసీలను ఒక్క చోటుకు చేర్చి సాంప్రదాయ పద్ధతులను పాటిస్తూ ఒకే వేదికపై 111 మందికి సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వనవాసి కళ్యాణ పరిషత్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో చెంచు గిరిజన యువతి యువకులకు 111 జంటలకు సామూహిక వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హైకోర్టు జడ్జ్ టీ మాధవి దేవి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆదివాసి కళ్యాణ ఆశ్రమం అఖిల భారత కార్యకారిణి ఇండోర్‌కు చెందిన రేఖ నాగర్, ప్రాంత అధ్యక్షులు కాట్రాజు వెంకటయ్య, శ్రీశ్రీశ్రీ అంబత్రాయ క్షేత్ర పీఠాధిపతి అదిత్య వర శ్రీ స్వామిలు సామూహిక వివాహాలు చేసుకున్న దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ అడవి బిడ్డల వివాహానికి హాజరు కావడం ఆనందంగా ఉందని ఈ ప్రాంత చెంచు గిరిజనులను మరొకసారి కలుసుకుంటానని గవర్నర్ అన్నారు. సమాజంలో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి సామాజిక రుగ్మతలను దూరం చేసే కార్యక్రమాలకు సాక్ష్యత్తు భగవంతుడే అండగా ఉంటారని గవర్నర్ అన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు దేవుడి అండ దండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ వేదికపై సామూహిక వివాహాలు జరుపుకున్న జంటలు సుఖ సంతోషాలతో పిల్లపాపలతో కలికాలం కలిసుండాలని గవర్నర్ ఆశీర్వదించారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయ ప్రకారం ఆదివాసీల వివాహాలు జరిపించడం అభినందనీయమని నిర్వాహకులను ఆయన అభినందించారు. చెంచు గిరిజనుల సామాజిక వివాహ మహోత్సవాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరై ఆశీర్వదించడం అభినందనీయం అన్నారు. హైకోర్టు జడ్జ్ టి.మాధవి దేవి మాట్లాడుతూ సామూహిక వివాహాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు ఇద్దరు కుమారులేనని, ఆడపిల్లలు లేరని వివాహం చేసుకున్న ఆదివాసి బిడ్డలు తన కూతుర్లు లాంటి వారని హైకోర్టు జడ్జ్ టి.మాధవి దేవి అన్నారు. తాను ఇదే నల్లమల కోడలినని పదర మండలం ఉడిమిళ్ల గ్రామానికి చెందిన తంగిరాల హనుమంత రెడ్డి కుటుంబం అన్నారు. నిరుపేదలైన చెంచు గిరిజనులకు తన అండదండలు ఎప్పటికీ ఉంటాయని, ఏ ఆపద వచ్చిన తాను అండగా ఉంటానన్నారు. అంతకుముందు నారాయణపేట జిల్లా అంబత్రేయ క్షేత్రానికి చెందిన ఆదిత్య పరాశర స్వామి ఆశీర్వచన ప్రసంగం గావించారు. సామూహిక వివాహాలకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం సామూహిక వివాహాలు చేసుకున్న నూతన వధువరులకు వివాహ సర్టిఫికెట్లను గవర్నర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కళ్యాణ పరిషత్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఉడతనూరి లింగయ్య, తెలంగాణ ఆదివాసి మహిళ ప్రముఖ గుర్రం శంఖులత, ఆర్ఎస్ఎస్ బాధ్యులు ఏమి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ రాజు, భాస్కరాచారి, వీరితో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# పత్తి రైతుకు కూలీల కొరత

## బ్రోకర్ల సాయంతో ఇతర రాష్ట్రాల నుండి రాక

**హైదరాబాద్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ప్రస్తుతం పత్తి, వరి తదితర వివిధ పంటల కోతలు, తీతలు జోరందుకోవడంతో కూలీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. ప్రధానంగా పత్తి సేకరణకు కూలీలు దొరకడం లేదు. ఒక పక్క వరి కోతలు మరోపక్క పత్తి ఏరడం ఏకకాలంలో మొదలయ్యాయి. దీంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు రైతులను వర్షం భయం వెంటాడుతోంది. పత్తి తడిసి దెబ్బతినక ముందే ఏరేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో కూలీలు కొరత ఏర్పడి పొరుగు రాష్ట్రాలకు రైతులు వెళుతున్నారు. కూలీల డిమాండ్ దృష్ట్యా ఖర్చులన్నీ భరించి కూలీలను తీసుకొస్తున్నారు. బ్రోకర్ల సాయంతో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, ఢిల్లీ ప్రాంత కూలీలు ప్రత్యేక వాహనాల్లో జిల్లాకు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. ఇందుకు బ్రోకర్‌కు కమీషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో జట్టుకు రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు బ్రోకర్ తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీల కుటుంబాలకు వాహనం కిరాయి రైతే భరించాల్సి వస్తోంది. దూరాన్ని బట్టి రూ.10 వేల నుండి రూ.15 వేలు వాహనానికి కిరాయి ఉంది. ఇక ఉత్తర భారతదేశం నుంచి వచ్చే వారికి ముందస్తు ట్రైన్ టికెట్లు బుక్ చేస్తున్నారు. పిల్లాపాపలతో ఇక్కడికి చేరుకున్న కూలీలకు బస ఏర్పాటు చేయాల్సి వస్తోంది. వారికి గుడారాల ఏర్పాటు, వంట చెరుకులు, కరెంటు, నీటిసౌకర్యాన్ని రైతులే కల్పిస్తున్నారు.

## డెవలప్‌మెంట్‌పై కాకుండా సెంటిమెంటుతో

# ఓట్ల కోసం పాకులాట

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** డెవలప్మెంట్ మీద హరీశ్‌రావు మాట్లాడకుండా సెంటిమెంట్ మీద ఓట్లు సంపాదించుకోవాలని చూస్తున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో ఆదివారం మాట్లా డుతూ ఎవరి గూబ గుయ్యి అంటదో హరీశ్‌రావుకు తొందరలోనే తెలుస్తుందని అన్నారు. లక్ష ఇల్లు ఎక్కడ కట్టారు? ఎవరికిచ్చారు? హరీశ్‌రావు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారాన్ని చేతిలో పెట్టుకొని ఇష్టానుసారంగా నాళాలను చెరువులని కబ్జాలు చేశారని దుయ్యబట్టారు. చిన్న వాన పడితే హైదరాబాద్ లో తిరగలేని పరిస్థితి దాని కారణం ఎవరని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చాయి అని హరీష్ రావు పనికిరాని మాటలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఉపఎన్నిక అంటే హరీశ్‌రావుని ట్రబుల్ షూటర్ అని డబ్బా కొట్టేవాళ్ళు హుజురాబాద్ ఉప ఎన్నికలలో ఎందుకు గెలవలేదో తెలుపాలని ప్రశ్నించారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో ఎంత డబ్బు పెట్టిరో ప్రజలందరికీ తెలుసని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ లో కూడా అదే చేద్దాం అనుకున్నారు మీ నాటకాలు నడవవు అని అన్నారు. నవీన్ యాదవ్ పేరు రాగానే బిఆర్ఎస్ ఇంకా గెలవదని తెలిసిపోయిందని ఎవరు డబ్బులతో గెలవాలని చూస్తున్నారో 11న ప్రజల నిర్ణయిస్తారని అన్నారు.

# హరీశ్‌రావు.. మీ అవినీతి ప్రజలు మరిచిపోలేదు

## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, అక్టోబరు 27 (జర్నలిస్ట్ ఫైల్) :** హరీష్ రావు మీ అవినీతి రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదని, మా మంత్రులగురించి మాట్లాడే హక్కు మీకెక్కడిదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. గాంధీభవన్‌లో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ లక్షల కోట్ల తెలంగాణ ధనాన్ని ముంచిన మీరు మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. మీ శాఖలోనే ఎంత అవినీతి ఉందో ప్రజలకు తెలుసని ఆయన అన్నారు. భూముల్ని ప్రజల ఆస్తుల్ని కొల్లగొట్టింది మీరు జూబ్లీహిల్స్ లో మీరు ఎన్ని ఇల్లు కట్టారు? అని నిలదీశారు. లేనిపోని ఆరోపణ చేస్తే ప్రజలు మిమ్మల్ని పట్టించుకోరనిహితవు చెప్పారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో మీ డబ్బా మీరే కొట్టుకోవడం తప్ప మీ గురించి ఎవరైనా మాట్లాడుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ బయటకి వచ్చి తన కూతురిని ఎందుకు పంపించారో ఒక స్టేట్మెంట్ ఇవ్వమనండి అని సవాల్ చేశారు. ఓటమిపాలై కిందపడినా కూడా పై చేయి మాదే అనుకొని భ్రమ పడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# తెలంగాణ ఉద్యమ తరహాలో రిజర్వేషన్ల ఉద్యమం

## తక్షణమే రాజ్యాంగ సవరణ చేయాలి

## బిసి జెఎసి సమావేశంలో నేతలు



బిసి జెఎసి సమావేశంలో అభివాదం చేస్తున్న వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితర నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), అక్టోబరు 27(జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ఉద్యమ తరహాలో బీసీ రిజర్వేషన్లకై బీసీలంతా ఏకమై ఉద్యమిస్తామని బీసీ జేఏసీ నేతలు స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జేఏసీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్‌ఛైర్మన్ వి.జి.ఆర్ నారగోని, కోఛైర్మన్ దాసు సురేష్‌లు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బీసీ జేఏసీ ఏర్పడిందని, రిజర్వేషన్లకై ఈనెల 18న జేఏసీ చేపట్టిన రాష్ట్ర బంద్ విజయవంతం అయిందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేసే పోరాటంలో ప్రాణాలు పోయినా రిజర్వేషన్లు సాధించే వరకు వదిలిపెట్టమని, భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, రాజకీ యంగా బీసీలను చైతన్యం చేస్తామని, రిజర్వేషన్ వ్యతిరేక శక్తులను బొంద పెడతామని హెచ్చరించారు. ఉద్యమాన్ని గల్లి నుంచి ఢిల్లీ వరకు ఉధృతం చేయటానికి నవంబర్ 2న కళింగ భవన్‌లో బీసీ జేఏసీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. నవంబర్ రెండవ వారంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, నియోజకవర్గ మండల కేంద్రాలలో నిరసన దీక్షలు చేపడతామని, నవంబర్ మూడో వారంలో పల్లె నుంచి పట్టణం వరకు భారీ ర్యాలీలు, ప్రదర్శనలు చేపడతామని, బీహార్ ఎన్నికల అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోదీని, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలను కలిసి, బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని కోరతామని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచటానికి రాజ్యాంగ సవరణ ఒక్కటే పరిష్కార మార్గమని, తక్షణమే రాజ్యాంగ సవరణ చేసి, బీసీ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై జరుగుతున్న ఈ పోరాటంలో అన్ని సంఘాలను కలుపుకుంటామని, పార్టీలకు అతీతంగా అందరి మద్దతు తీసుకుంటా మని వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ జేఏసీ కోఆర్డినేటర్ గుజ్జకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్య క్షులు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్‌బాబుపై బిఆర్ఎస్ ప్రేరేపిత నీలాపనిందలు

## పెట్టుబడులు అడ్డుకోవడానికి కెటిఆర్ డైరెక్షన్‌లో రాజకీయాలు

## రాజకీయ దురుద్దేశ్యంతో మంత్రిపై పుట్ట మధు అసత్య ప్రచారాలు: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, అక్టోబరు 27(జర్నలిస్ట్ ఫైల్) :** బిఆర్ఎస్ నేతలు మంత్రి శ్రీధర్ బాబు పై నిరాధారమైన నీలాపనిందలు వేస్తూ ఆయన ప్రతిష్ఠను దిగజార్చే కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ పుట్ట మధు రాజకీయ దురుద్దేశ్యంతోనే అసత్యాలను ప్రచారం చేస్తున్నాని ఆవేదన చెందారు. మీరు ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా,మంత్రి శ్రీధర్‌బాబు ఏంటో, ఆయన కుటుంబం ఏంటో ఈ రాష్ట్ర ప్రజలకు బాగా తెలునని అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులను అడ్డుకోవడానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై ప్రజల్లో అపనమ్మకం సృష్టించడానికే కెటిఆర్ స్వీయ దర్శకత్వంలో కొందరు బిఆర్ఎస్ నాయకులు ఈ తరహా రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఎన్నో ఏళ్లుగా శ్రీధర్ బాబు మంత్రిగా పనిచేస్తూ వస్తున్నారు, రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వచ్చేలా చేసి, ఎంతో మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నారని ఆయన వివరించారు.అలాంటి వ్యక్తి పేరు బద్నాం చేయాలన్న కుట్రతోనే బిఆర్ ఎస్ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తూ ఆనందం పొందుతున్నారని అన్నారు. దొంగల పార్టీలో ఉన్న దొంగలే ఇప్పుడు 'దొంగ దొంగ' అని అరుస్తూ, నీతులు వల్లే వేస్తూ ఎదుటి వారి పైకి వేలెత్తి చూపుతున్నారని విమర్శించారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోమని ఫిర్యాదు చేసిన వారిపైనే బురద చల్లడం, చిల్లర రాజకీయాలు చేయడం తెలంగాణ లో తప్ప ఎక్కడా కనిపించదని ఉదహరించారు. మంత్రి శ్రీధర్ బాబు ఓఎస్డీ పేరిట నకిలీ లెటర్ హెడ్స్‌ను ఎవరో బయట వ్యక్తులు సృష్టించి ఐటీ ప్రాజెక్టులు ఇప్పిస్తామంటూ బాధితుల నుంచి రూ.1.77 కోట్లు వసూలు చేశారని సంఘటనను ఎమ్మెల్సీ వివరించారు. ఇందులో మంత్రి శ్రీధర్ బాబు పేషీకి గానీ, మంత్రి గారి వ్యక్తిగత, ఇతర సిబ్బందికి గానీ ఎలాంటి సంబంధం లేదని బల్మూరి వివరణ ఇచ్చారు. ఈ విషయం మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి రాగానే ఆయన వెంటనే అప్రమత్తమయ్యారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాధితులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకు న్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ ఓఎస్డీని ఆదేశించారు. మంత్రి ఓఎస్డీ స్వయంగా జూన్ 3న సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో నా నకిలీ లెటర్ హెడ్స్ మోసానికి పాల్పడిన ఒడూరి వివి సత్యనారాయణ అలియాస్ సతీష్ ఆయన ఆరుగురు గ్యాంగ్ సభ్యులపై ఫిర్యాదు చేశారని తెలిపారు ఫిర్యాదు ఇచ్చిన రోజు అంటే జూన్ 3న సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్(ఎఫ్ఐఆర్ 67/2025) నమోదు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ కు చెందిన పోలీస్ ఉన్నతాధికారులతో మంత్రి శ్రీధర్ బాబు స్వయంగా మాట్లాడారని అన్నారు.

**గ్లోబల్ క్యాపిటల్‌గా హైదరాబాద్‌ను రూపొందించిన శ్రీధర్‌బాబు: లింగంయాదవ్**

హైదరాబాద్ గ్లోబల్ క్యాపిటల్‌గా తయారించిన మంత్రి శ్రీధర్ బాబు ఆరోపణలు చేయడం మానుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ అన్నారు. మంత్రి పేషీ నుండే ఫిర్యాదు చేశారు కానీ పుట్ట మధు శ్రీధర్ బాబు ఇమేజ్ దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని ఆవేదన చెందారు. పుట్ట మధు కి సెటిల్ మెంట్‌లుహత్యలు తప్పా ఆయనకేం తెలుసు అని ప్రశ్నించారు ఆధారాలు ఉంటే మాట్లాడు కానీ శ్రీధర్ బాబు ఇమేజ్ డ్యామేజి చేయాలని చూడకు అని హితవు చెప్పారు. శ్రీధర్ బాబు మీద ఆరోపణలు చేయడం అంటే, ఆకాశం మీద ఉమ్మేయడమే అని అన్నారు. శ్రీధర్ బాబు గురించి కెటిఆర్ కెసిఆర్‌నీ అడిగి తెలుసుకోఅని అన్నారు . పుట్ట మధు కుట్రలపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు. శ్రీధర్ బాబు పేషీ పై పుట్ట మధు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. .

# జిఎస్‌టి మార్పులతో అందరిలో సంతోషం

### అత్యంత క్రూరంగా నిజాం పాలన
### 127వ మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ
### ఎఐ సాయంతో 11భాషల్లో ప్రసంగం

**న్యూఢిల్లీ, అక్టోబరు 27 :** దసరా, దీపావళి పండుగల వేళ జిఎస్‌టి శ్లాబుల తీసుకొచ్చిన మార్పులు అన్ని వర్గాల్లో తీసుకువచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభివర్ణించారు. అలాగే ఈ సీజన్‌లో దేశీయ వస్తువుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయన్నారు. వంట నూనె వినియోగాన్ని 10శాతం తగ్గించాలని రాసిన లేఖకు సానుకూల స్పందన వచ్చిందని ప్రధాని వెల్లడించారు. మన్‌కీ బాత్ 127వఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గార్బేజ్ కేఫ్ వినూత్నంగా పర్యావరణానికి సేవలు అందిస్తోందని తెలిపారు. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి ఫుల్ మీల్స్ తినొచ్చు. మీరు కిలో వ్యర్థాలు ఇస్తే లంచ్ లేదా డిన్నర్ ఏర్పాటు చేస్తారు. అదే అరకిలో ఇస్తే అల్పాహారం ఇస్తారు. ఈ కేఫ్‌ను అంబికాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోందని ప్రధాని అభినందించారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుపుకుంటున్న ఛాత్‌పూజ మహోత్సవం గురించి, మావోయిస్టుల గురించి కూడా ప్రధాని మోడీ మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్, నక్సలిజం నిర్మూలన కోసం తీసుకున్న చర్యల కారణంగా ఈ ఏడాది పండుగలు మరింత ఉత్సాహంగా మారాయని మోడీ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ప్రతి భారతీయుడిలో గర్వాన్ని నింపిందన్నారు. ఈసారి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు కనిపించాయని వివరించారు.

**31న రన్ ఫర్ యూనిటీలో పాల్గొనండి:** అదేవిధంగా, సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని ప్రధాని మోడీ గుర్తు చేసుకున్నారు. అక్టోబర్ 31న జరగనున్న "రన్ ఫర్ యూనిటీ (ఐక్యతా పరుగు) కార్యక్రమంలో ప్రతి పౌరుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సర్దార్ పటేల్ భారతదేశాన్ని ఏకం చేసిన నేతగా,

### కుమురం భీం వీరత్వం తెలుసుకోండి

నిజాం పాలనపై తెలంగాణ పోరాట వీరుడు కుమురం భీం చేసిన పోరాటాన్ని ప్రధాని మోడీ కొనియాడారు. భారత్‌ను దోచుకోవడానికి బ్రిటిష్‌పాలకులు అన్ని దోపిడీ మార్గాలను వాడారు. ఆ సమయంలో దేశభక్తి గల హైదరాబాద్ ప్రజల ప్రతిస్పందన వీరోచితంగాఉంది. బ్రిటిష్ వారు నిజాం పాలనను బలపరిచారు. నిజాం పాలన అత్యంత క్రూరంగా ఉండేది. పేదలు, గిరిజనులపై నాడు జరిగిన వేధింపులు వర్ణనా తీతం. ప్రజల భూములను స్వాధీనం చేసుకున్నారు. భారీగా పన్నులు విధించారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తే వారి చేతులను నరికివేశారు. అలాంటి కష్టకాలంలో 20 ఏళ్ల కుర్రాడు ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. అతడి పేరు చెప్పబోయే ముందు, ఆ కుర్రాడి వీరత్వం గురించి తెలుసుకోండి. నిజాంపై ఒక్కమాట మాట్లాడటం కూడా నేరమే భావించేకాలంలో ఆ కుర్రాడు నిజాంఅధికారి సిద్ధిఖీని బహిరంగంగానే సవాల్ చేశాడు. అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో ఆ యువకుడు సిద్ధిఖీని మట్టుబెట్టాడు. అరెస్టును కూడా తప్పించుకున్నాడు. అక్కడినుంచి అతడు అసోంకు చేరుకున్నాడు. ఆయువ వీరుడి పేరు కుమురంభీం అని ప్రధాని మోడీ వివరించారు. కేవలం40యేళ్లే బతికినా, ప్రజలపై చెరగని ముద్ర వేశారనిచెప్పారు. నిజాంకు చాలా కాలంపాటు సవాలుగా నిలిచారని తెలిపారు. 1940లో నిజాం సైనికులు ఆయన్ను హత్య చేశారన్నారు. ఆయన గురించి తెలుసుకునేందుకు యువత వీలైనంత ప్రయత్నించాలని కోరుతున్నానని ప్రధాని మోడీ వెల్లడించారు. మరో ప్రముఖ గిరిజన నాయుకుడు భగవాన్ బిర్సా ముండా గురించి ప్రధాని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం, గిరిజన సమాజ హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం గురించి కొనియాడారు.



పరిశుభ్రత, సువచ్ఛపాలనకు ప్రతీకగా నిలిచారని మోదీ అభివర్ణించారు. ప్రధానమంత్రి భారత జాతీయ గీతం "వందేమాతరం" గురించి ప్రస్తావిస్తూ, 2025 నవంబర్ 7న ఈ గీతం 150వ వార్షికోత్సవం జరగనున్నదని తెలిపారు. ఈ అద్భుతమైన గీతాన్ని రచించిన బంకిం చంద్ర ఛటర్జీని ఆయన స్మరించారు. "వందేమాతరం మన దేశ ఆత్మను ప్రతిబింబించే గీతం, అది ప్రతి భారతీయుడిలో దేశభక్తి జ్వాలను రగిలిస్తుంది," అని మోడీ అన్నారు.

**11 భాషల్లో మోడీ ప్రసంగం:** ఈసారి మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ సందేశాన్ని ఎఐ టెక్నాలజీ సహాయంతో 11 భారతీయ భాషలలోకి అనువదించారు. అంటే మోడీ ప్రసంగం 11 భాషల్లో వినిపించింది అన్నమాట. ఈ భాషల్లో ప్రసంగం ఎఐ సహాయంతో మలయాళం, తెలుగు, కన్నడ, ఇంగ్లీష్, గుజరాతీ, బెంగాలీ, తమిళం, మరాఠీ, అస్సామీ, ఒరియాతో సహా మొత్తం 11 భాషలలో మోడీ ప్రసంగం ఒకేసారి వినిపించింది. దీని వలన దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు వారి మాతృభాషలో ప్రధాని సందేశాన్ని వినగలిగారు. పాఠ్యాంశాలను 11భాషల్లోకి అనువదించడానికి ఎఐని ఉపయోగించడాన్ని ప్రధాని ప్రశంసించారు. భవిష్యత్తులో ఎఐ కొత్త సాంకేతిక పరిజ్ఞానాలలో ప్రపంచాన్ని నడిపించగల సామర్థ్యం ఆధునిక భారతదేశానికి ఉందని ఈ చర్య ద్వారా ప్రభుత్వం ప్రదర్శించింది.



## చర్చలు కొలిక్కిరాకుంటే అఫ్ఘాన్‌తో యుద్ధమే

**కరాచి, అక్టోబరు 27 :** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు అత్యంత ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య రెండో విడత శాంతి చర్చలు శనివారం ఇస్తాంబుల్‌లో ప్రారంభమయ్యాయి. అయితే, ఓవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే మరోవైపు పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చలు విఫలమైతే ఆఫ్ఘనిస్థాన్‌తో బహిరంగ యుద్ధానికి దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. టర్కీ, ఖతార్ దేశాల సంయుక్త మధ్యవర్తిత్వంతో ఈ చర్చలు జరుగుతున్నాయి. అక్టోబర్ 18,19 తేదీల్లో దోహాలో తొలి విడత చర్చలు జరిగాయి. తాజా చర్చల్లో ఆఫ్ఘనిస్థాన్ తరఫున ఉప అంతర్గత వ్యవహారాల మంత్రి రహమతుల్లా ముజీబ్, అనస్‌హక్కానీ పాల్గొంటుండగా, పాకిస్థాన్ నుంచి ఇద్దరు భద్రతాధికారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈచర్చల ఫలితం వెలువడే అవకాశంఉందని పాక్ రక్షణమంత్రి సియాల్‌కోట్‌లో తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన డైలీ టైమ్స్ కథనం ప్రకారం, చర్చలు విఫలమైతే ఆఫ్ఘనిస్థాన్‌తో బహిరంగ యుద్ధం తప్పదని, అయితే రెండు పక్షాలు శాంతినే కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ దేశంపై దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఉగ్రవాద సంస్థను తమ భూభాగం నుంచి పూర్తిగా ఏరివేయాలని ఆఫ్ఘనిస్థాన్‌కు పాకిస్థాన్ గట్టిగా తేల్చిచెబుతోంది. ఈ విషయంలో ఆఫ్ఘన్ నుంచి కచ్చితమైన, ధ్రువీకరించదగిన హామీని పాక్ కోరుతున్నట్లు అక్కడి ఖిడాన్‌ఖి పత్రిక పేర్కొంది. అలాగే, చర్చల పురోగతిని పర్యవేక్షించేందుకు టర్కీ, ఖతార్‌లతో కూడిన తృతీయ పక్ష పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఇస్లామాబాద్ ప్రతిపాదిస్తోంది. గత కొద్దివారాలుగా డ్యూరాండ్ లైన్ వద్ద ఇరు దేశాల సైనికుల మధ్య పలుమార్లు ఘర్షణలు జరగడంతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరిగాయి. దీనికి తోడు, ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ ఇటీవల ఢిల్లీలో పర్యటించడం పాకిస్థాన్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ నేపథ్యంలోనే, కునార్ నదిపై వీలైనంత త్వరగా డ్యామ్‌ల నిర్మాణం చేపట్టాలని తాలిబన్ సుప్రీంలీడర్ హిబతుల్లా అఖుంద్జాదా ఆదేశించడం ఇస్లామాబాద్‌కు కొత్త తలనొప్పిగా మారింది. పాకిస్థాన్‌లో చిత్రాల్‌నదిగా, ఆఫ్ఘనిస్తాన్‌లో కునార్‌నదిగా పిలిచే ఈనదిపై డ్యామ్‌లు నిర్మిస్తే నీటి ప్రవాహంపై ప్రభావం పడుతుందని పాకిస్థాన్ ఆందోళన చెందుతోంది.

### అమెరికా కొత్త యుద్ధాన్ని సృష్టిస్తోంది: వెనుజులా అధ్యక్షుడు మదురో



**కేరకాస్, అక్టోబరు 27:** మాదక ద్రవ్యాల అక్రమ రవాణా విషయంలో వెనుజులాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో కరీబియన్ సముద్రజలాల్లో డ్రగ్స్‌ను తరలిస్తున్న పడవలు, జలాంతర్గాములపై అగ్రరాజ్యం దాడులు ముమ్మరం చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద వాహకనౌక 'యుఎస్‌ఎస్ గెరాల్డ్ ఆర్ ఫోర్డ్'ను వెనుజులా సమీపానికి తీసుకెళ్లడం ద్వారా ఆ దేశంపై ఒత్తిడి తీవ్రతరం చేసింది. ఈ పరిణామాలను వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురో తీవ్రంగా ఖండించారు. అమెరికా ప్రభుత్వం తనపై యుద్ధం చేస్తోందని ఆరోపించారు. 'ట్రంప్ యంత్రాంగం కొత్త,శాశ్వత యుద్ధాన్ని సృష్టిస్తోంది. మాదకద్రవ్యాల విషయంలో అతిశయోక్తులతో కూడిన, అసభ్యకరమైన, నేరపూరితమైన, తప్పుడు కథనాలను అల్లుతోంది. మా దేశం కొకైన్ పత్రాలను ఉత్పత్తి చేయదు' అని మదురో జాతీయ మీడియాలో ప్రసంగించారు. వెనుజులాకు చెందిన వ్యవ స్థీకృత నేరాల ముఠా 'ట్రెన్ ది అరాగ్వా'కు మదురో నాయకుడని ట్రంప్ ఇటీవల ఆరోపించారు. మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడం లేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు.

## పాక్‌పై ట్రంప్ మళ్లీ పొగడ్తలు

**కౌలాలంపూర్, అక్టోబరు 27 :** ఆసియాన్ సదస్సు కోసం కౌలాలంపూర్ చేరుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మలేసియాలో ఘనస్వాగతం లభించింది. స్వాగతం సందర్భంగా ట్రంప్ రెడ్ కార్పెట్‌పై అనూహ్యంగా డ్యాన్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ట్రంప్‌తోపాటు మలేసియా అధ్యక్షుడు అన్వర్ ఇబ్రహీం కాలు కదిపారు. ఆదివారం రోజు థాయ్‌లాండ్ - కాంబోడియా దేశాలు శాంతి ఒప్పందంపై సంతకాలు చేసే కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, పాక్ ఆర్మీ చీఫ్, ప్రధానమంత్రిపై ప్రశంసల జల్లు కురిపించారు. అలాగే, గత 8 నెలల్లో తాను ఆపిన 8 యుద్ధాల్లో థాయ్‌లాండ్- కాంబోడియా యుద్ధం కూడా ఒకటని ట్రంప్ చెప్పారు. సగటున ప్రతినెలా ఒక యుద్ధాన్ని తాను ఆపానన్నారు. పాక్ -అఫ్గానిస్థాన్ సైనిక ఘర్షణ ఒక్కటే మిగిలిందని, త్వరలోనే దాన్ని కూడా ఆపుతానని అమెరికా ప్రెసిడెంట్ స్పష్టం చేశారు. థాయ్‌లాండ్-కాంబోడియా యుద్ధాన్ని ఆపినందుకు గర్వంగా ఉందని, శాంతిఒప్పందంకుదిరినందున ఆ రెండుదేశాలు ఇకపై స్నేహపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు.

## కరూర్ బాధిత కుటుంబాలను కలవనున్న విజయ్

**చెన్నై, అక్టోబరు 27 :** ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కజగం పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగిన విషయం అందరికీ తెలిసిందే . ఈ ఘటనలో మొత్తంగా 41 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. విజయ్ బాధిత కుటుంబాలను కలిసేందుకు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. కానీ కేసులు, అనుమతి నిరాకరణ వల్ల జాప్యం జరుగుతూ వచ్చింది. ఈ క్రమంలోనే మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి, పరామర్శించడానికి ఆయన ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఓ రిసార్ట్‌లో 50 గదులు బుక్ చేసి మరీ బాధిత కుటుంబాలక కోసం ప్రత్యేక బస్సులను పెట్టారు. వాటిల్లోనే వీరంతా రిసార్ట్ రానుండగా విజయ్ వారందరినీ పరామర్శించనున్నారు. విజయ్ సోమవారం చెన్నై శివార్లలోని ఒక రిసార్ట్‌లో బాధిత కుటుంబాలను కలవనున్నారు. ఈ సమావేశం కోసం టీవీకే పార్టీ ఏకంగా 50 గదులను బుక్ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏర్పాటు ద్వారా బాధిత కుటుంబాల ప్రతినిధులను ఒక్కొక్కరినీ విడివిడిగా కలిసి, వారి బాధను పంచుకుని, వ్యక్తిగతంగా సానుభూతి తెలియజేయాలని విజయ్ భావిస్తున్నారు. వాస్తవానికి ఆయన నేరుగా కరూర్ వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించాలనుకున్నారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా, అలాగే శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆయన పర్యటనకు అనుమతి నిరాకరించింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులందరినీ చెన్నైకి తీసుకు వచ్చి పరామర్శించేందుకు ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకున్నట్లు పార్టీ స్పష్టం చేసింది. మేము సమావేశ స్థలానికి చేరుకోవడానికి టీవీకే పార్టీ వారు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. మా కుటుంబాల నుంచి చాలా మంది సభ్యులు ఈ పరామర్శ కార్యక్రమానికి వెళ్తున్నామని బాధిత కుటుంబానికి చెందిన ఒక సభ్యుడు తెలిపారు.

## సతారా డాక్టర్ కేసులో సబ్ ఇన్‌స్పెక్టర్ అరెస్ట్



**సతారా, అక్టోబరు 27 :** మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మహిళా డాక్టర్ ఆత్మహత్య చేసుకున్న కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆమెపై పలుమార్లు అత్యాచారం చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ గోపాల్ బదానేను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరో నిందితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీడ్ జిల్లాకు చెందిన ఒక మహిళా డాక్టర్ సతారాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. గురువారం రాత్రి ఫల్టాన్ పట్టణంలోని ఒక హోటల్ గదిలో ఆమె ఉరివేసుకుని విగతజీవిగా కనిపించారు. తన అరచేతిపై రాసుకున్న సూసైడ్ నోట్‌లో ఎస్ఐ గోపాల్ బడానే తనపై పలుమార్లు అత్యాచారం చేశాడని, ప్రశాంత్ బంకర్ మానసికంగా వేధించాడని ఆమె ఆరోపించారు. దీంతో పోలీసులు అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపణ కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు మొదట ప్రశాంత్ బంకర్‌ను పుణెలో అరెస్ట్ చేశారు. ఆ తర్వాత కొన్ని గంటలకే ఎస్సై బడానే ఫల్టాన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. బంకర్‌ను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం నాలుగు రోజుల పోలీస్ కస్టడీ విధించింది. ఈ ఆరోపణల నేపథ్యంలో ఎస్సై బడానేను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రశాంత్ బంకర్, మృతురాలు నివాసం ఉంటున్న ఇంటి యజమాని కుమారుడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తున్నారు. వేధింపుల గురించి ఆమె గతంలో చాలాసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని బంధువులు ఆరోపించారు. పోస్ట్‌మార్టం డ్యూటీలో ఉన్నప్పుడు మెడికల్ రిపోర్టులు మార్చాలంటూ కొందరు రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు వచ్చేవని కూడా వారు తెలిపారు. ఈ కేసు ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. గతంలో ఓ సందర్భంలో బీజేపీ మాజీ ఎంపీ రంజిత్‌సింగ్ నాయక్ నింబాల్కర్ ఆమెపై ఒత్తిడి తెచ్చారని శివసేన (యూబీటీ) నేత అంబదాస్ దన్వే ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను నింబాల్కర్ ఖండించారు. ఈ కేసులోకి కావాలనే తన పేరును లాగుతున్నారని ఆయన స్పష్టం చేశారు. మృతురాలు ఒక సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి, ఎండీ చేయాలని కలలు కన్నారని ఆమె బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎంబీబీఎస్ కోసం తీసుకున్న రూ.3 లక్షల అప్పు కూడా ఇంకా తీర్చలేదని వారు తెలిపారు.

## మణిపూర్‌లో విజృంభిస్తున్న డెంగ్యూ



**మణిపూర్, అక్టోబరు 27:** మణి పూర్‌లో డెంగ్యూ విజృంభిస్తున్నది. అక్టోబర్ 25నాటికి ఆ రాష్ట్రవ్యాప్తంగా 3,334 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 2,323 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇంఫాల్‌తూర్పులో మొత్తం 608 కేసులు నమోదయ్యాయి. మణిపూర్‌లో గత 24 గంటల్లో 69 కొత్త కేసులు నమోదైనట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ తెలిపింది. ఇంఫాల్ వెస్ట్‌లో కొత్తగా 38 కేసులు, ఇంఫాల్ తూర్పులో 21 కొత్త కేసులను గుర్తించినట్లు పేర్కొంది. కాగా, మణిపూర్‌లోని అన్ని జిల్లాల్లో డెంగ్యూ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్‌లో 96, తౌబాల్‌లో 74, సేనాపతిలో 61, కాక్చింగ్ జిల్లాలో 45 డెంగ్యూ కేసులు నమోదై నట్లు చెప్పారు. ఉఖ్రుల్, చందేల్, తమెంగ్‌లాంగ్, టెంగ్నౌపాల్, కామ్‌జోంగ్, నోనీ, కాంగ్‌పోక్పి, చురచంద్‌పూర్ జిల్లాల్లో 50 కంటే తక్కువ కేసులు ఉన్నాయన్నారు. మరోవైపు జిరిబామ్, ఫెర్జావల్‌లో ఎలాంటి డెంగ్యూకేసులు నమోదు కాలేదని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్ జిల్లాలో డెంగ్యూవల్ల ఒకరు మరణించినట్లు వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు వివరించారు.

## మధ్యప్రదేశ్‌లో అక్రమ ఆయుధాల ఫ్యాక్టరీ



**భోపాల్, అక్టోబరు 27 :** ఫామ్‌హౌస్‌లో గుట్టుగా ఆయుధాలు తయారు చేస్తున్నారు. గన్స్‌తో దొరికిన ఒక వ్యక్తి నుంచి సేకరించిన సమాచారంతో అక్రమ ఆయుధ ఫ్యాక్టరీపై రైడ్ చేశారు. పలు పిస్టల్స్‌తోపాటు తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 21న అమల్హరి గ్రామ కూడలి సమీపంలో ఒక వ్యక్తి అక్రమంగా పిస్టల్స్ అమ్మేందుకు వేచి ఉన్నట్లు బరోహి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్‌కు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని అతడ్ని అరెస్ట్ చేశారు. 32బోర్ పిస్టల్ ఒకటి, మూడు 315బోర్ పిస్టల్స్, మూడు లైవ్ కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఆ వ్యక్తిని పోలీసులు ప్రశ్నించారు. దీంతో రూపవైలోని ఒక ఫామ్‌హౌస్‌ను నెలకు రూ.20,000 చొప్పున అద్దెకు తీసుకుని అక్రమంగా ఆయుధాలు తయారు చేస్తున్నట్లు బయటపడింది. ఈ నేపథ్యంలో పోలీసులు రైడ్ చేశారు. 12 దేశీయ పిస్టల్స్, మూడు లైవ్ కార్ట్రిడ్జ్‌లు, ఆయుధ తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిపుణులైన సిబ్బందిని నియమించుకుని వారికి నెలకు రూ.50,000 చొప్పున చెల్లిస్తూ ఈ తుపాకీ ఫ్యాక్టరీని పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఇది తెలుసుకుని పోలీసులు షాక్ అయ్యారు. పిస్టల్స్‌ను అసెంబుల్ చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అయితే సెప్టెంబర్ 19 నుంచి ఈ ఫామ్‌హౌస్‌లో అక్రమంగా ఆయుధాలు తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు 22 పిస్టళ్లను తయారు చేశారు. ఇందులో ఏడు పిస్టల్స్‌ను అమ్మారు. వీటిని కొనుగోలు చేసిన ముగ్గురు వ్యక్తులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. మరికొందరి సమాచారం సేకరించారు. ప్రధాన నిందితుడైన పేరుమోసిన నేరస్తుడు పరారీలో ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. అతడ్ని పట్టుకోవడం కోసం రూ. 10,000 రివార్డు ప్రకటించారు.

## యమునా మురికినీటితో సిఎం రేఖాగుప్తా నివాసానికి ఆప్ నేతలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 27 :** దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది కాలుష్యంపై రాజకీయ వివాదం కొనసాగుతున్నది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఢిల్లీ యూనిట్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్ యమునా నది నుంచి మురికి నీటిని ఒక బాటిల్‌లో సేకరించారు. ఆప్ నేతలతో కలిసి సీఎం రేఖ గుప్తా నివాసానికి చేరుకున్నారు. ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ యమునా నదిని శుభ్రం చేసిందని భావిస్తే ఆ బాటిల్ లోని నీటిని సీఎం రేఖ గుప్తా తాగాలని సౌరభ్ భరద్వాజ్ సవాల్ చేశారు. ఛత్ పూజకు ముందు అబద్ధాలను బీజేపీ వ్యాప్తి చేస్తున్నదని ఆయన ఆరోపించారు. కాగా, బీజేపీ ప్రభుత్వం నెలల తరబడి శుద్ధి చేసిన తర్వాత యమునా నది నీరు ఆచారాలకు అనుకూలంగా ఉన్నదని ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి అనిల్ గుప్తా తెలిపారు. ఆచమనం చేసిన ఆయన ఆ నీటిని తాగారు. ఈ వీడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆప్ ఢిల్లీ యూనిట్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. 'బీజేపీ అబద్ధాల కారణంగా యమునా నదిని సీఎం శుభ్రం చేశారని లక్షలాది మంది పూర్వాంచల్ మహిళలు, చిన్న పిల్లలు భావిస్తారు. ఛత్ పూజ సందర్భంగా ఆ నీటిని తాగుతారు. ఆ తర్వాత ప్రాణాంతక అనారోగ్యానికి గురవుతారు' అని అన్నారు.



## ఐర్లాండ్‌ప్రధానిగా వామపక్ష స్వతంత్ర నేత కేథరీన్ కన్నోలి

**ఐర్లాండ్, అక్టోబరు 27 :** ఐర్లాండ్ అధ్యక్ష ఎన్నికలలో వామపక్షవాద స్వతంత్రనేత కేథరీన్ కన్నోలి ఏకపక్షంగా ఘన విజయం సాధించారు. ఆమెకు సిన్ ఫెయిన్‌తోపాటు వామపక్ష పార్టీలన్నీ మద్దతిచ్చాయి. దాంతో ఆమె ప్రత్యర్థి, సెంటర్ రైట్ పార్టీ అయిన ఫైన్ గాయెల్ అభ్యర్థి హీథర్ హంఫ్రేస్ ఘోర పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికల్లో కేథరీన్‌కు మొదటి ప్రాధాన్య ఓట్లలోనే ఏకంగా 63 శాతం ఓట్లు దక్కాయి. హంఫ్రేస్ కేవలం 29 శాతం ఓట్లతోనే సరిపెట్టుకున్నారు. కాగా బారిస్టరు అయిన కన్నోలి.. 2016 నుంచి చట్టసభ సభ్యురాలిగా ఉన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆమె బహిరంగంగా వ్యతిరేకించారు. ఇజ్రాయెల్‌ను టెర్రరిస్టు దేశంగా అభివర్ణించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధంనేపథ్యంలో ఐరోపా కూటమి సైనికీకరణనూ తప్పుబట్టారు. ప్రస్తుతం ఐర్లాండ్ అధ్యక్షులుగా మైఖేల్ డి హిగ్గిన్స్ ఉన్నారు.

## తలసీమా రోగులకు హెచ్‌ఐవి పాజిటివ్!



**రాంచీ, అక్టోబరు 27 :** జార్ఖండ్‌లోని చాయ్ బసాలో దారుణం వెలుగు చూసింది. తలసీమియా వ్యాధితో బాధపడుతున్న ఐదుగురు చిన్నారులకు హెచ్‌ఐవీ పాజిటివ్ నిర్ధారణ కావడం కలకలం సృష్టిస్తోంది. స్థానిక బ్లడ్ బ్యాంక్‌లో రక్తం ఎక్కించుకున్న తర్వాత తలసీమియా వ్యాధితో బాధపడుతున్న తమ ఏడేండ్ల కుమారుడికి హెచ్‌ఐవీ సోకిందని బాధిత కుటుంబం వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జార్ఖండ్ ప్రభుత్వం తక్షణమే స్పందించి విచారణ నిమిత్తం ఉన్నతస్థాయి వైద్య బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ వైద్య బృందం విచారణ జరపగా, మరో నాలుగు కేసులు వెలుగులోకి వచ్చాయి. వైద్య బృందానికి నేతృత్వం వహిస్తున్న డాక్టర్ దినేశ్ కుమార్ సదర్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసీమియా రోగికి కలుషిత రక్తం ఎక్కించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఈ క్రమంలో బ్లడ్ బ్యాంకును పరిశీలించాం. బ్లడ్ బ్యాంకులో కొన్ని లోపాలు ఉన్నట్లు గుర్తించామని, దానిపై విచారణ చేస్తున్నామన్నారు. లోపాలను సరి చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించామని డాక్టర్ దినేశ్ కుమార్ తెలిపారు.

## సంక్షిప్తంగా..



### అణుశక్తి క్షిపణిని పరీక్షించిన రష్యా

**మాస్కో, అక్టోబరు 27 :** రష్యా అమ్ములపొదిలో సరికొత్త అస్త్రం వచ్చి చేరనుంది. అణుశక్తితో నడిచే 'బూరెవెస్ట్‌నిక్' క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు దేశాధినేత పుతిన్ ప్రకటించారు. అపరిమితమైన పరిధి కలిగిన ఈ క్షిపణి మోహరింపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సాయుధ దళాలను ఆదేశించారు. రష్యా సైన్యం ఇటీవల 'అణు' విన్యాసాలు నిర్వహించింది. పుతిన్ వాటిని స్వయంగా పర్యవేక్షించారు. ఈ క్రమంలోనే రష్యా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, ఇతర సైనిక కమాండర్లతో ఆయన ఓ సమావేశంలో మాట్లాడారు. పరీక్షల సమయంలో 'బూరెవెస్ట్‌నిక్' క్రూయిజ్ క్షిపణి 15 గంటలపాటు గాల్లోనే ఉందని, 14 వేల కిలోమీటర్లు ప్రయాణించిందని తెలిపారు. అంతకుముందు సైనిక ఉన్నతాధికారులతో పుతిన్ భేటీ అయ్యారు. రష్యా సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ వాలెరీ గెరాసిమోవ్ నేతృత్వంలోని కమాండర్లతో సంభాషించారు.

### పారిస్‌లో ప్రియురాలితో జస్టిన్ ట్రూడో



**ఒట్టావా, అక్టోబరు 27 :** కెనడా మాజీప్రధాని జస్టిన్ ట్రూడో, అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీతో డేటింగ్ లో ఉన్నారంటూ వార్తలు వస్తున్నవేళ తాజా వారిద్దరూ కలిసి ఓపార్టీలో పాల్గొన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పారిస్‌లోని థియేటర్ నుంచి శనివారం రాత్రి ట్రూడో కేటీపెర్రీ చేతిలో చేయి వేసుకొని బయటకు వస్తున్న దృశ్యాలు కనిపించాయి. అక్కడ జరిగిన ఓ మ్యూజికల్ షోకు వీరు హాజరైనట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. కేటీ పెర్రీ 45వ పుట్టినరోజు సందర్భంగా వీరు అక్కడికి వెళ్లినట్లు సమాచారం. ఈ యేడాది జూలైలో ట్రూడో-పెర్రీలు మాంట్రియల్‌లోని ఓ రెస్టారెంట్‌లో తొలిసారి కనిపించారు. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం మొదలైంది. ట్రూడో-కేటీలు దీనిపై ఇప్పటివరకూ స్పందించలేదు. కొద్దిరోజుల క్రితం ఓఖరీదైన నౌకపై వీరు అత్యంత సన్నిహితంగా విహరించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

### బిష్ణోయ్ గ్యాంగ్ అనుచరుడిని భారత్‌కు రప్పించిన సిబిఐ

**న్యూఢిల్లీ, అక్టోబరు 27 :** వ్యవస్థీకృత నేరాలపై భారత ఏజెన్సీలు ఉక్కుపాదం మోపాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న కీలక గ్యాంగ్‌స్టర్ లఖ్వీందర్ కుమార్‌ను అమెరికా నుంచి భారత్‌కు దర్యాప్తు అధికారులు రప్పించారు. ఢిల్లీ విమానాశ్రయంలో అడుగుపెట్టిన వెంటనే హర్యానా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది. లఖ్వీందర్‌పై హర్యానాలో హత్యాయత్నం, బెదిరించి డబ్బులు వసూలు చేయడం, అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం వంటి పలు తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసుల నేపథ్యంలో అతడు విదేశాలకు పారిపోయాడు. దీంతో హర్యానా పోలీసులు చేసిన విజ్ఞప్తి మేరకు, సీబీఐ ఇంటర్‌పోల్ ద్వారా 2024 అక్టోబర్ 26న అతడిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. సీబీఐ, విదేశాంగ శాఖ, హోం మంత్రిత్వ శాఖల సమన్వయంతో అమెరికా అధికారులతో సంప్రదింపులు జరిపి లఖ్వీందర్‌ను భారత్‌కు బహిష్కరించేలా చర్యలు తీసుకున్నాయి.



### అంకెల్లోనే బిలియనీర్.. క్షణకాలంలోనే మాయం

**భోపాల్, అక్టోబరు 27 :** మధ్యప్రదేశ్‌కు చెందిన నోటరీ, ప్రైవేటు స్కూలు యజమాని వినోద్ డోంగ్లే తలరాత రాత్రికి రాత్రే మారిపోయింది. ఆయన డీమ్యాట్ ఖాతాలోని ఓ కంపెనీ షేర్ల విలువ రూ.2,817 కోట్లకు చేరినట్లు చూపించింది. అయితే, ఈ ఆనందం కాసేపటికే ఆవిరైపోయింది. అప్పటి వరకు ఒక్కో షేరు రూ.2.14 కోట్లు చొప్పున 1,312 షేర్ల విలువ రూ.2,817 కోట్లుగా చూపించగా కాసేపటికే ఆ అంకెలన్నీ మాయమై పాత విలువనే చూపించాయి. ఒక్కో షేరు 63 పైసల చొప్పున రూ.826.56 పైసలుగా చూపించింది. వార్సిల్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ షేర్ల విషయంలో వినోద్ డోంగ్లేకు ఈ విచిత్ర అనుభవం ఎదురైంది. కాసేపే అయినా అంకెల్లో తను బిలియనీర్‌ను అయ్యానని వినోద్ డోంగ్లే సంతోషం వ్యక్తం చేశారు.

### ఎప్పటికైనా అమెరికా అధ్యక్షురాలినవుతా: కమలా హ్యారిస్



**వాషింగ్టన్, అక్టోబరు 27 :** అమెరికా అధ్యక్ష పదవిపై మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం లేకపోలేదని ఆమె పేర్కొ న్నారు. భవిష్యత్తులో అమెరికా అధ్యక్షురాలిగా ఒక మహిళ వైట్‌హౌస్‌లో ఉండడం ఖాయమని, బహుశా అది నేనే కావచ్చు అన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమలా హారిస్ మాట్లా డుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ట్రంప్ ఫాసిస్ట్ ధోరణితో వ్యవహరిస్తారని హెచ్చరించానని, ఇప్పుడు అదినిరూపితమైందని ఆమె అన్నారు. నా మనవరాళ్లు వారి జీవితంలో ఖచ్చితంగా ఓ మహిళా అధ్యక్షురాలిని చూస్తారని ఆమె పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసే విషయంపై ఇంకా నిర్ణయంతీసుకోలేదని, రాజకీయాల్లో భవిష్యత్తు ఉందని ఇప్పటికీ నమ్ముతున్నానని హారిస్ పేర్కొన్నారు.

## 31 కస్టమ్స్ సుంకాల నోటిఫికేషన్ల విలీనం

**న్యూఢిల్లీ, అక్టోబరు 27 :** కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డ్ (సీబీఐసీ) 31కస్టమ్స్ డ్యూటీ నోటిఫికేషన్లను ఏకైక ఏకీకృత నోటిఫికేషన్‌గా విలీనంచేసింది. ఇది వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుందని ఎక్స్ పోస్ట్‌లో తెలిపింది. సరళీకరణ, పారదర్శకత, వ్యాపారం చేయడం సులభతరంగా మార్చడంలో భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొంది. ప్రస్తుత సుంకాల మినహాయింపులు, ప్రయోజనాలన్నీ ఈకొత్త నోటిఫికేషన్‌లో ఉన్నాయి. అదే సమయంలో ఇవన్నీ మరింత నిర్మాణాత్మకంగా, సరళంగా ఉన్నాయి. కస్టమ్స్ విధానాలను హేతుబద్ధం చేయడం లో, వీటిని పాటిం చడంలో వ్యాపారులు, కస్టమ్స్ అధికారులపై భారాన్ని తగ్గించడంలో ఈ చర్య మైలురాయి వంటిది.

## రోడ్డు ప్రమాదాల నివారణకు కౌన్సిలింగ్



○ మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరిక

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):**రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మంగళగిరి రూరల్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గత శని, ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ తనిఖీల్లో మైనర్ల చేత డ్రైవింగ్, సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మొత్తం 23 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు... సోమవారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వాహనదారులకు, వాహనాలు నడిపిన మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి గ్రామీణ చిరుమామిళ్ల వెంకట్ మాట్లాడుతూ మైనర్ బాలుర తల్లిదండ్రులు, వాహన యజమానులను పిలిపించి రోడ్డు భద్రతా అవగాహన, కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా నిరోధించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వలన ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ వెంకట్ సూచించారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందని గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు.

## భక్తులతో పోటెత్తిన శైవాలయాలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** త్రిదళం త్రిగుణాకారం, త్రినేత్రంచ, త్రియాయుధం, త్రిజన్మ పాపసంహారం, ఏకబిల్వం శివార్పమంటూ... కార్తీకమాస తొలిసోమవారప్రాతః కాలాన,శైవాలయాల్లో భక్తిమీర అభిషేక పూజలు నిర్వహించారు..స్థానిక గంగానమ్మ పేటలో వేంచేసియున్న, పరసురామ ప్రతిష్ఠితిమైన, పర్వత వర్ధిని సమేత శ్రీరామేశ్వర స్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జామునుండె, భక్తులు ఆలయానికి చేరుకుని, స్వామి వారికి విశేష అభిషేక పూజలు నిర్వహించి, ప్రకృతి వైపరిత్యాల నుండి, ఒడ్డున పడేలా స్వామి కరుణించాలని మొక్కుకున్నారు. మొంధా తుఫాన్ ప్రభావం వల్ల, ఎటువంటి కష్టం, నష్టం లేకుండా చూడాలని, అర్చక స్వాములు, సంకల్పం చేసుకుని పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక మాస, సామూహిక దీపోత్సవ కార్యక్రమంలో, కార్తీక దీపాలతొ, ముక్కంటిని ఆరాధించారు. ఆలయ ఈఒ రమణకుమారి మాట్లాడుతు కార్తీక మాస ప్రాధాన్యతా క్రమంలొ, ప్రతి సోమవారం ఆలయంలొ నిర్విరామంగా అభిషేక పూజలకు ఏర్పాట్లు చేశాని, భక్తులు వారి సమయానుకూలంగా వచ్చి, అభిషేక పూజలు నిర్వహించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మారీస్ పేటలోని శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలొ, పంచాక్షరి నామ సంకీర్తనతో, స్వామివారికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు.అదే విధంగా పట్టణంలోని వివిధ శైవాలయాల్లో భక్తులు కార్తీక సోమవార ప్రాధాన్యతను చాటుతూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

## మైనారిటీల అభ్యున్నతికి రోడ్ మ్యాప్ : ఎమ్మెల్యే నసీర్

○ సంక్షేమ, అభివృద్ధి ఫలాల అమలుకు త్వరలో నూతన కమిటీ

○ కూటమి ప్రభుత్వంలోనే మైనారిటీల ఆర్థిక ప్రగతి

○ అర్హులైన మైనారిటీలందరికీ విరివిగా రుణాలు

○ మైనారిటీ శాఖ సమావేశంలో అసెంబ్లీ మైనారిటీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వంలో మైనారిటీల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో దీని కోసం రోడ్ మ్యాప్ రూపొందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక అసెంబ్లీలో మైనారిటీ శాఖ, లీడ్ బ్యాంక్ అధికారులతో నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మైనారిటీలకు అమలవుతున్న సంక్షేమ ఫలాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మైనారిటీలకు అందాల్సిన పథకాల అమలకు త్వరలో అధికారులతో నూతన కమిటీని ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇమామ్ లు, మౌజన్లకు గౌరవ వేతనం నిధులు అందించామని తెలిపారు. రాష్ట్రంలో ఎంత మంది ఇమామ్ లు, మౌజన్లు ఉన్నారని, వీరి అర్హతకు ప్రామాణికమేమిటని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో మైనారిటీ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు, లెక్చరర్ల సంఖ్యపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ సిబ్బంది అవసరమో గుర్తించి వివరాలు అందజేయాలని సూచించారు. 2014-19 మధ్య కాలంలో మైనారిటీలకు ఎంత వరకు రుణాలిచ్చారు ? ఆ తర్వాత ఎంత మంజూరు చేశారో నివేదిక సమర్పించాలని లీడ్ బ్యాంక్ అధికారులను కోరారు. మైనారిటీలకు విరివిగా రుణాలివ్వాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. అనంతరం బీఆర్ అంబేద్కర్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ స్కీమ్ కు 2014-19 మధ్య కేటాయించిన నిధులు, అనంతరం మంజూరైన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో మైనారిటీలకు అమలవుతున్న పథకాలు వివరాలు ఇవ్వాలన్నారు. కేంద్ర నుంచి మైనారిటీలకు వచ్చే పథకాలపై ఆరా తీస్తూనే.. ఆయా పథకాలను రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న విధానంపై ఆరా తీశారు. సీడ్ యాప్ ద్వారా నమోదైన నిరుద్యోగుల్లో ఎంత మందికి ఇప్పటి వరకు శిక్షణ కల్పించిన వివరాలు తెలియజేయాలన్నారు. వక్ఫ్ బోర్డు సమస్యలతోపాటు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందించిన రుణాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. బీసీ -ఈల సర్టిఫికెట్ల జారీలో అర్హతకు ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారో తెలియజేయాలన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మైనారిటీల సంఖ్య ఎంత ఉంది ?రాష్ట్రంలో ఇప్పటి వరకు మైనారిటీలకు ఎంత ఖర్చు చేశారు ? అనే విషయాలపై ఆరా తీశారు. హజ్ యాత్రికులకు అర్హత, అకామిడేషన్ వంటి వివరాలు సమర్పించాలని కోరారు.

## భారీ వాహనాలు రావడానికి వీల్లేదు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ భారీ వాహనాల వలన రోడ్లు ధ్వంసం అవుతుంటే, ఈ వాహనాలకు ఎవరూ అనుమతులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో భారీ వాహనాలు రాకుండా చూడాలని గళ్ళా మాధవి, ట్రాఫిక్, ఆర్టీవో అధికారులకి ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. సోమవారం ఆర్&బి, మున్సిపల్, ట్రాఫిక్, ఆర్టీవో అధికారులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్షా సమావేశం నిర్వహించారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అనుమతులు లేని భారీ వాహనాలు అడ్డగోలుగా రోడ్డు మీదకు వస్తున్నాయని, ఒక్కో వాహనం 28 టన్నులు వరకు మాత్రమే అనుమతులు ఉండగా, దానిని తుంగలో తొక్కుతూ ఒక్కో వాహనం 60 టన్నుల పైగానే లోడుతో రాకపోకలు చేస్తున్నాయని, దీని వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, అలా వచ్చిన వాహనాలు రాత్రి పూట రోడ్డు అడ్డంగా నిలిపి ఉంచుతున్నారని, ఈ రకంగా ఉన్న ఈ వాహనాలు నగరంలోకి రావటానికి ఎవరు అనుమతి ఇస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు %డ% ఆర్టిఓ అధికారుల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భారీ వాహనాల వలన ఏర్పడిన గుంటల వలన, వర్షపు నీరు అందులో చేరితో, ఆ నీరును మున్సిపల్ అధికారులు ఎందుకు తొడటం లేదని, దీని వలన భారీ గోతులు ఏర్పడుతున్నాయని మున్సిపల్ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఏర్పడిన గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రోడ్లు ధ్వంసం అవ్వటానికి కారణంమైన భారీ వాహనాల పట్ల ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారులు పరస్పర సమన్వయంతో తనిఖీలు నిర్వహించి, నగరంలోకి రాకుండా కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే అనేక మంది రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఇటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. జీ.టి. రోడ్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, గుంతల వలన ప్రజలు పడుతున్నారని, ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

## ఎల్ఐసీ నిధులపై తప్పుడు ఆరోపణలు చేయొద్దు

○ సిపిఐ పై మండిపడ్డ బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** సిపిఐ నాయకుడు జంగాల అజయ్ కుమార్ ఎల్ఐసీ నిధులను మోడీ ప్రభుత్వం తప్పుదారి పట్టిస్తోందని చేసిన ఆరోపణలు తప్పుడు వేనని భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

అజయ్ కుమార్ ఎల్ఐసీ నిధులపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఎల్ఐసీకి మొత్తం 41 లక్షల కోట్ల రూపాయల నికర బడ్జెట్ ఉందని, ఇందులో భాగంగానే పలు ప్రధాన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినట్లు వివరించారు. టీసీఎస్‌లో 5.7 లక్షల కోట్లు, రిలయన్స్‌లో 1.3 లక్షల కోట్లు, ఐటీసీ లో 82 వేల కోట్లు, ఎస్బిఐలో 79 వేల కోట్లు, హెచ్డిఎఫ్సీలో 68 వేల కోట్లు ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టిందని తెలిపారు. ఆదాని కంపెనీలో కూడా ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టడం సాధారణ పెట్టుబడి విధానం ప్రకారం జరిగిందని తిరుపతిరావు పేర్కొన్నారు. "మోడీ ప్రభుత్వం ఎల్ఐసీ నిధులను ఏ విధంగానూ దుర్వినియోగం చేయడం లేదు. వాస్తవాలు తెలియక ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయొద్దు," అని హెచ్చరించారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు కొనసాగిస్తే ప్రజలు ఇప్పటికే గుణపాఠం చెప్పినట్లు, మరింత గట్టిగా సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని చెరుకూరి తిరుపతిరావు స్పష్టం చేశారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన చైర్ పర్సన్ టి. రాధిక



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**పట్టణ పరిదిలోనివార్డులలొ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు తగు ప్రాధాన్యం కల్పిస్తున్నామని వివిధ అభివృద్ధిపనులకు భూమిపూజ చేసిన సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 35,36,37 వార్డుల పరిదిలొ సోమవారం 92.3లక్షల నిర్మాణ వ్యయంతొ, సిసి రోడ్లు, సిసి డ్రైన్లు నిర్మాణానికి, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిధిగా పాల్గొని,అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు పట్టణ పరిదిలోని అన్ని వార్డులొ, ఆయా వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు తగు ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈకార్తక్రమాల్లొ ఆయా వార్డు కౌన్సిలర్లు గొడవర్తిసాయి హరేరామ్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, రామ్ నరేష్, డిఇఇ శ్రీనివాసరావు, ఎఇ ఆంజనేయరాజు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలవరపెడుతున్న మొంధాతుఫాన్



○ పంటపొలాలను పరిశీలించిన జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియ

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**మొంథా తుఫాన్ ప్రభావంతొ, వాతావరణంలొ చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా అధికార యంత్రాంగం, అప్రమత్తమై, తుఫాన్ ఉధృతికి అనుగుణంగా, ప్రాణ నష్టం, ఆస్తినష్టం సమస్యను అధిగమించే దిశగా, క్షేత్ర స్థాయిలొ తీసుకుంటున్న జాగ్రత్తలను పరిశీలలించె,నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెనాలి నియోజకవర్గంలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

సోమవారం ఉదయం తెనాలి మండలంలోని కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో పర్యటించారు. తుఫాను నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు ఎటువంటి సమస్య తలెత్తిన వాటి ఎదుర్కొనే దిశగా అధికారులు సిద్ధంగా ఉండాలని సూఛించారు.

అనంతరం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్సో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పట్టణంలో అధికారులు చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలు వివరించారు. తదుపరి జిల్లా కలెక్టర్ అన్సారియా కొల్లిపర మండలంలో పంట పొలాలను పరిశీలించారు. రైతులతోనూ ఇటు గ్రామస్తులతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ అన్సారియా తుఫాన్ ముప్పు నేపథ్యంలో అధికారులు ఎటువంటి జాగ్రత్త చర్యలు తీసుకున్నారన్నది పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావసా కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ తో పాటు సబ్ కలెక్టర్ సంజన సింహ, స్పెషల్ ఆఫీసర్ తులసి ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మొంధా తుఫాన్ ఉధృతి పై, వాతావరణశాఖ హెచ్చరికలతొ, కరీఫ్ వరి సాగు చేసిన రైతులలొ కలవరం చోటుచేసుకుంది. నవంబర్ నెల మూడవ వారంలొ వరి కోతలు సమయం కావడంతొ, తుఫానుల తాకిడి వెంటాడేనా అనేభావన రైతులను కలవరపెడుతుంది.

## విజ్ఞాన్ యూనివర్సిటీలోని ప్రోగ్రామ్స్‌కు ప్రతిష్ఠాత్మక ఎన్‌బీఏ టైర్ -1 అక్రిడిటేషన్

○ మరో మైలురాయిని దాటిన విజ్ఞాన్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ మరో మైలురాయిని చేరుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలకు జాతీయ స్థాయిలో నాణ్యత ప్రమాణాలను నిర్ధారించే నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు టైర్-1 అక్రిడిటేషన్ లభించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ. నాగభూషణ్ మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ మొదటి నుంచి విద్యా నాణ్యత, పరిశోధనలో ప్రతిభ, సామాజిక బాధ్యత - ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్స్‌కు ఎన్‌బీఏ టైర్-1 అక్రిడిటేషన్ పొందడం ద్వారా విజ్ఞాన్ విద్యా ప్రమాణాలకు, బోధనా నాణ్యతకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఇది మా విద్యార్థులు, అధ్యాపకులు, నిర్వాహకుల సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.

న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌బీఏ తనిఖీ బృందం 2025 ఆగస్టు 29 నుంచి మూడు రోజులపాటు విజ్ఞాన్ యూనివర్సిటీని సందర్శించిందని తెలిపారు. ఈ బృందం బోధనా విధానాలు, సిలబస్, టీచింగ్-లెర్నింగ్ ప్రాసెస్, ప్రాజెక్ట్-బేస్డ్ లెర్నింగ్, విద్యార్థుల పరిశోధనా పేపర్లు, ల్యాబ్ సదుపాయాలు, పరిశోధన ప్రాజెక్టులు, ప్లేస్‌మెంట్ అవకాశాలు, విద్యార్థుల అచీవ్‌మెంట్స్, హాస్టల్ వసతి, క్రీడా కార్యకలాపాలు వంటి అంశాలను విస్తృతంగా పరిశీలించిందన్నారు.

"ఈ అక్రిడిటేషన్ విజ్ఞాన్ యూనివర్సిటీని భారతదేశంలోని అత్యుత్తమ టెక్నికల్ ఇన్‌స్టిట్యూషన్‌ల సరసన నిలిపిందన్నారు. టైర్-1 స్థాయి అంటే అంతర్జాతీయ ప్రమాణాలతో సమానమైన విద్యా నాణ్యత అని అర్థమన్నారు. విదేశాలలో ఉన్నత విద్యావకాశాలు కోరుకునే విద్యార్థులకు ఇది అదనపు ప్రయోజనంగా నిలుస్తుందన్నారు. ఎన్‌బీఏ టైర్-1 సర్టిఫికేషన్ ఉన్న విద్యార్థుల డిగ్రీలు విదేశీ విశ్వవిద్యాలయాలు, బహుళజాతి కంపెనీలు గుర్తిస్తాయి" అని వివరించారు.

ఈసారి టైర్-1 అక్రిడిటేషన్ లభించిన ప్రోగ్రామ్‌లు - బయోమెడికల్, బయో ఇన్ఫర్మాటిక్స్, సివిల్, కెమికల్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లకు మూడు సంవత్సరాల పాటు అక్రిడిటేషన్ లభించిందన్నారు. ఇక ఇప్పటికే కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులకు ఈ గుర్తింపు లభించిందన్నారు. దీంతో విజ్ఞాన్ యూనివర్సిటీకి మొత్తం 10 ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లకు టైర్-1 అక్రిడిటేషన్ లభించిందన్నారు.

"ఎన్‌బీఏ అక్రిడిటేషన్ ఉండటం వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లో విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రాధాన్యత పెరుగుతుందని, అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉన్నత స్థాయి పరిశోధన ప్రాజెక్టులు, గ్రాంట్లు పొందేందుకు ఇది మరింత దోహదం చేస్తుందన్నారు. విద్యార్థుల కోసం కొత్తగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇండస్ట్రీ%-%అకాడమియా లింకేజ్ ప్రోగ్రామ్‌లు ప్రారంభించేందుకు యూనివర్సిటీ సిద్ధమవుతోందని తెలిపారు. ఈ విజయంతో విజ్ఞాన్ యూనివర్సిటీ జాతీయ స్థాయిలోనే కాకుండా, అంతర్జాతీయ వేదికలపైనా తన విద్యా ప్రాభవాన్ని నిలబెట్టుకుందని, "విజ్ఞాన్ అంటే విద్యలో నాణ్యతకు ప్రతీక" అనే నినాదాన్ని మరోసారి సాక్షాత్కరించిందన్నారు.

ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీ ఎల్లప్పుడూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ గుర్తింపు మన ప్రయత్నాలను మరింత బలపరుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ అక్రిడిటేషన్లు సాధించడం మా తదుపరి లక్ష్యమన్నారు. అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్‌లకు టైర్-1 అక్రిడిటేషన్ పొందడం వలన విద్యార్థులకు అంతర్జాతీయ కంపెనీలలో ప్లేస్‌మెంట్లు, విదేశీ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యలో ప్రవేశాలు సులభం అవుతాయన్నారు. అలాగే ఫ్యాకల్టీ పరిశోధన, ఇన్నోవేషన్, స్టార్ట్-అప్ కల్చర్‌ను మరింతగా ప్రోత్సహిస్తామని తెలిపారు.

అర్హత కలిగిన అన్ని ప్రోగ్రామ్‌లకు టైర్-1 అక్రిడిటేషన్ సాధించడంలో కృషి చేసిన ఐక్యూఏసీ సిబ్బందిని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘనా కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## గుంటూరులో ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్...805 వాహనాలు స్వాధీనం

○ ప్రతి ఒక్కరూ సురక్షితంగా వాహనాలు నడపాలి - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు జిల్లాలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే లక్ష్యంతో పోలీసులు రెండు రోజులపాటు ప్రత్యేక ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకుని మొత్తం 805 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక్క గుంటూరు నగర పరిధిలోనే 313 వాహనాలు ఉండటం గమనార్హం.

సోమవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 'ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై అవగాహన సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పాల్గొని, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనికి ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయడమేనని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు.

ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరూ సురక్షితంగా వాహనాలు నడిపి, క్షేమంగా గమ్యానికి చేరుకోవడమే మా ప్రధాన లక్ష్యం. జరిమానాలు విధించడం కాదు, ప్రజల్లో అవగాహన పెంపొందించడమే మా ఉద్దేశం" అని తెలిపారు. ఈ సందర్భంగా మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రాణాలను ప్రమాదంలో పడేస్తాయని హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా స్వాధీనం చేసుకున్న 805 వాహనాల్లో 141 మైనర్ డ్రైవింగ్, 98 ర్యాష్ డ్రైవింగ్/బైక్ రేసింగ్, 218 ట్రిపుల్ రైడింగ్, 115 నంబర్ ప్లేట్ లేనివి, 230 హెల్మెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని వాహనాలు ఉన్నాయి. గుంటూరు నగరంలో మాత్రం 315 వాహనాలు స్వాధీనం అయ్యాయి. వీటిలో 64 మైనర్ డ్రైవింగ్, 40 ర్యాష్ డ్రైవింగ్, 137 ట్రిపుల్ రైడింగ్, 60 నంబర్ ప్లేట్ లేనివి, 12 పత్రాలు లేని వాహనాలు ఉన్నాయి.

మైనర్ డ్రైవింగ్‌పై మాట్లాడిన ఎస్పీ తల్లిదండ్రులను హెచ్చరిస్తూ, "ప్రేమతో పిల్లలకు వాహనాలు ఇవ్వడం ప్రమాదం. మైనర్లకు లైసెన్స్ ఇవ్వరు, ఓటు హక్కు కూడా ఉండదు. వారి ఆలోచన పరిపక్వంగా ఉండదు. కాబట్టి మైనర్లకు వాహనాలు ఇవ్వడం పూర్తిగా తప్పు" అన్నారు.

హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించిన ఆయన, "మన సెల్‌ఫోన్ స్క్రీన్ కాపాడుకునేందుకు స్క్రీన్ గార్డ్ వేస్తాం. కానీ ప్రాణరక్షక హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యం చేయడం తగదు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు గాయాల వల్లే మరణాలు జరుగుతాయి. కాబట్టి ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి" అని సూచించారు.

ఇన్సూరెన్స్, లైసెన్స్ ప్రాముఖ్యతను వివరించి, "ఇవి ఉండడం వలన ప్రమాద సమయంలో ఆర్థిక సాయం, నాణ్యమైన వైద్యం పొందే అవకాశం ఉంటుంది. రోడ్డు నియమాలు పాటించడం మనకే కాక ఇతరుల ప్రాణ రక్షణకూ దోహదం చేస్తుంది" అన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, వెస్ట్ డీఎస్పీ అరవింద్, ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐలు అశోక్, సింగయ్య, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి, లాలాపేట సీఐ శివ ప్రసాద్, నగరంపాలెం సీఐ కిషోర్ కుమార్, ఆర్ఐలు సురేష్, శ్రీహరి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## గౌతంరెడ్డి వివాహ రిసెప్షన్‌కు హాజరైన సిఎం



**వెల్దుర్తి (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పెద్ద కుమారుడు వివాహ రిసెప్షన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం హాజరయ్యారు. నూతన దంపతులు జూలకంటి గౌతంరెడ్డి, తేజస్వినికి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. అనంతరం జూలకంటి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విదేశీ పర్యటనలో ఉన్నందున వివాహానికి హాజరు కాలేకపోయానని, రిసెప్షన్‌కు వచ్చానని సిఎం తెలిపారు. పల్నాడు జిల్లా వెల్దుర్తికి వచ్చిన సిఎంకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు.

## తుఫాన్ దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ఎన్డీయే కూటమి నేతలు ప్రజలకు అందుబాటులో ఉండాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- పునరావాస కేంద్రాల గురించి ప్రజలకు సమాచారం ఇవ్వాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తుఫాన్ దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అదే విధంగా పునరావాస కేంద్రాల గురించి ప్రజలకు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ఈ విపత్కర సమయంలో ఈ పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవలందించాలని కోరారు.

సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో మొంథా తుఫాను ప్రభావం పై ముందస్తు చర్యలు, ప్రజలకు కల్పించవలసిన పునరావాస కేంద్రాలు, వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితులపై నోడల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యుత్ శాఖ, తహసీల్దార్, ట్రాఫిక్ పోలీసులు తదితర శాఖాధికారులతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ డివిజన్‌ల వారీగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, వాటిలో అవసరమైన సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావాన్ని తగ్గించేందుకు మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్, ఫైర్, విద్యుత్ శాఖలతో సమన్వయం కలిగి ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశించారు. ప్రజల భద్రత కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు సహాయం అందించేందుకు ఎన్డీయే కూటమి నేతలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని గళ్ళా మాధవి కోరారు. ట్రాఫిక్ సమస్యలపై కూడా ఆమె ప్రత్యేక దృష్టి సారించి, తుపాను సమయంలో నగరంలో ట్రాఫిక్ జామ్‌లు రాకుండా, చిన్న వాహనాలు నిర్లక్ష్యంగా నడపకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా కమాండ్ కంట్రోల్ రూమ్ పర్యవేక్షణను బలోపేతం చేయాలని, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

## 'మొంథా' తుపాను - ఆ జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు, భారీగా ఎగసిపడుతున్న అలలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడింది. ఇది 'మొంథా' తుపానుగా మారినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది బంగాళాఖాతంలో "నైరుతి–ఆగ్నేయ మధ్య కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. గడిచిన 6 గంటల్లో గంటకు 16 కిలోమీటర్ల వేగంతో కదిలింది. మంగళవారం ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

## భయాందోళనలు వద్దు, అప్రమత్తంగా ఉండండి



**ఘంటసాల (జర్నలిస్ట్ ఫైల్) :** మొంతా తుఫాను పట్ల నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కోరారు. సురేష్ బాబు సోమవారం ఘంటసాలలోని ఘోటకం ఏ కాలనీ ని సందర్శించి అక్కడ నివసించే నిరుపేద కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ తుఫాను పట్ల భయాందోళనలకు గురి కాకుండా,అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు,ఉద్యోగులు నిత్యం క్షేత్రస్థాయిలో తుఫాను విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటే తుఫాను వల్ల జరిగే నష్టాన్ని చాలావరకు తగ్గించవచ్చన్నారు. రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు,సభ్యులు తుఫాను సహాయక చర్యల్లో భాగస్వాములు కావాలని తద్వారా బాధితులకు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు అల్పాహారం ప్యాకెట్లను నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు దేవరపల్లి కోటయ్య,మేరుగు వేణుగోపాలరావు,కట్టా గోపి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పకడ్బందీగా ముందస్తు చర్యలు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- శ్రీకాకళం, మన్యం, కోనసీమ జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎప్ప టికప్పుడు జిల్లాల కలెక్టర్లు తో ఫోన్లో మాట్లాడి సమాచారం తెలుసుకుంటున్న మంత్రి
- ప్రజలకు ఎప్ప టికప్పుడు ముందస్తు సమాచారం అందేలాచూడాలి
- ప్రత్యేక అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి తుఫాన్ ప్రభావ పరిస్థితులను ఆరా తీస్తున్న మంత్రి



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుపాను ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో శ్రీకాకళం, మన్యం, కోనసీమ జిల్లాల అధికారులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు సోమవారం ఫోన్‌ల్లో మాట్లాడారు. చేపట్టాల్సిన చర్యలపై ఆయన పలు సూచనలు జారీ చేశారు. "తుపానుపై అధికారులు అప్రమత్తం గా ఉండాలి. ఎటువంటి పరిస్థితినైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలి. అన్నిమండల, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పా టు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు ఎప్ప టికప్పుడు ముందస్తు సమాచారం అందేలా చూడాలి. రోడ్లపై చెట్లు కూలితే వెంటనే తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పునరావాస శిబిరాల సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు అందించాలన్నారు. తాగునీటి సరఫరా పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి భోజనం ఇతర ఆహారం పానీయాలు అందించాలని ఆదేశించారు. ప్రాణ , ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. జిల్లాలకు నియమించిన ప్రత్యేక అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి తుఫాన్ ప్రభావ పరిస్థితులను మంత్రి పర్యవేక్షిస్తున్నారు. రక్షిత తాగు నీరు, పాలు, ఔషధాలు సమకూర్చాలి. గాలుల తీవ్రతకు విద్యు త్ స్తం భాలు పడిపోతే వెం టనే పునరుద్ధరిం చాలి మొంథా తుపాను ప్రభవావం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రమత్తం చేస్తోం దని అన్నారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. యంత్రాంగం సిద్ధంగా ఉన్నందున ప్రజలు ఆదోళన చెందవద్దు అన్నారు. గాలుల తీవ్రతకు విద్యు త్ స్తం భాలు పడిపోతే వెం టనే పునరుద్ధరించాలి దేశించారు. అదేవిధంగా రైతులు శాస్త్ర వేత్తల సూచనుల, మార్గదర్శికాలు పాటించాలని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృం దాలు సన్న ద్ధం గా ఉన్నాయని ప్రజలకు కావాల్సిన వసతులను పునరావాస కేంద్రాల్లో ఏర్పా టు చేశామని అన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు.

## తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గుంటూరు జిల్లా పోలీసులు అప్రమత్తం

- ప్రజల భద్రత కోసం కంట్రోల్ రూమ్లు ఏర్పాటు - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ తరఫున సమగ్ర ఏర్పాట్లు చేపట్టారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణను దృష్టిలో ఉంచుకొని జిల్లా స్థాయిలో, అలాగే ప్రతి పోలీస్ సబ్‌డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేసి, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపినట్లు, ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రమాదకర వంతెనలు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ప్రధాన రహదారులు, రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అత్యవసర స్పందన బృందాలను నియమించారు. ప్రజలు కూడా అత్యవసర పరిస్థితులు తప్ప గృహాల నుండి బయటకు రాకుండా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తుఫాన్ ప్రభావిత గ్రామాలు, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి, జిల్లా పోలీసులు సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్, వైద్య, రోడ్లు, నీటిపారుదల, పశుసంవం–ర్ధక, టెలికాం శాఖలతో నిరంతర అనుసంధానం కొనసాగిస్తున్నారు.

జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నంబర్ 0863-2230100 కాగా, ప్రతి పోలీస్ సబ్‌డివిజన్‌కి ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు ఈస్ట్ సబ్‌డివిజన్ (0863-2223353), వెస్ట్ (0863-2241152 / 2259301), నార్త్ (08645-237099), సౌత్ (0863-2320136), తెనాలి (08644-255829), తుళ్లూరు (08645-243265).

కంట్రోల్ రూమ్‌లు 24ఐ7 విధానంలో పనిచేస్తూ, తుఫాన్ పరిస్థితులపై సమాచారం సేకరణ, సమన్వయం, ప్రజలకు హెచ్చరికలు, అవసరమైన సహాయం అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రతి కంట్రోల్ రూమ్‌కు డీఎస్పీ స్థాయి అధికారి నోడల్ అధికారిగా నియమించబడి, వారి పర్యవేక్షణలో సీఐలు, ఎస్సైలు, సిబ్బంది విధుల్లో ఉన్నారు.

పోలీస్ శాఖ సూచనల ప్రకారం ఆశ్రయ కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, లైటింగ్, ఔషధాలు, పరిశుభ్రతా సదుపాయాలు సిద్ధంగా ఉంచారు. వృద్ధులు, గర్భిణీలు, పిల్లలు వంటి సున్నిత వర్గాల వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు ప్రారంభించారు. బస్సులు, పడవలు, అంబులెన్సులు వంటి రవాణా వనరులు సిద్ధంగా ఉంచబడ్డాయి.

ప్రజలకు సమయానుకూల సమాచారం అందించేందుకు రేడియో, టీవీ, సోషల్ మీడియా, పబ్లిక్ అడ్రెస్ వ్యవస్థల ద్వారా ప్రచారం కొనసాగుతోంది. తుఫాన్ సమయంలో ప్రయాణాలు మానుకొని, సురక్షితంగా ఉండాలని పోలీసులు సూచించారు.

జిల్లా పోలీసులు స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఫైర్ సర్వీస్, అవసరమైతే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలతో కలిసి రక్షణ, తరలింపు చర్యలు చేపడుతున్నారు. గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించేందుకు వైద్య శాఖతో సమన్వయం కొనసాగుతోంది.

తుఫాన్ అనంతరం రోడ్లు, వంతెనలు, విద్యుత్ లైన్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ పునరుద్ధరణకు చర్యలు చేపట్టి, నష్టం అంచనా నివేదికలు సిద్ధం చేయనున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా వెంటనే కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ బాధ్యతలు స్వీకరణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నేలపాడులోని రాష్ట్ర హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయనతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ మానవేంద్ర రాయ్ స్వస్థలం ఉమ్మడి విజయనగరం జిల్లా పార్వతీపురం. న్యాయవిద్య అభ్యసించిన తదుపరి 2002 లో జిల్లా జడ్జి క్యాడర్లో నియమితులై వీరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయ సేవలు అందజేశారు. 2015 జూలై నుండి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గా మరియు 2019 జూన్ నుండి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందజేయగా 2023 నవంబర్ లో గుజరాత్ హైకోర్టుకు బదిలీపై వెళ్లారు. గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీపై సొంత రాష్ట్రానికి వచ్చిన ఆయన తిరిగి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,అడిషనల్ సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె. చిదంబరం,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్. ద్వారకానాథ్ రెడ్డి అదనపు అడ్వకేట్ జనరల్ ఇ. సాంబశివ ప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి,పలువురు ఇతర రిజిస్ట్రార్లు,సీనియర్ న్యాయవాదులు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ సభ్యులు మరియు హైకోర్టు ఉద్యోగులు,ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ,ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద మృతదేహాలు అప్పగింత పూర్తి



**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్) :** కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాల అప్పగింత సోమవారం పూర్తయింది. ఆదివారం రాత్రికి 18 మంది మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా సోమవారం ఉదయం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ (29) మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కర్నూలు తహశీల్దార్ ఆంజనేయులు, పోలీసుల సమక్షంలో కర్నూలు స్మశాన వాటికలో ప్రశాంత్ మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం ప్రమాదం జరగగా అదే రోజు అర్ధరాత్రి రెండు గంటల వరకు 16 వైద్య బృందాలు మృతదేహాలకు డిఎన్ఎ పరీక్షలు నిర్వహించాయి. బంధువుల డిఎన్ఎ తీసుకుని అదే రోజు పరీక్ష నిమిత్తం మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆదివారం ఉదయం డిఎన్ఎ రిపోర్టులు రావడంతో మృతదేహాలను బంధువులకు అప్పగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. డిఎన్ఎ రిపోర్టుల మ్యాచింగ్ ప్రకారం మృతదేహాలను వారివారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎన్ఐఆర్ కాపీ, డెత్ సర్టిఫికెట్, పోర్టుమార్టం నివేదికలను అందజేశారు.

## అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు... నేడు విజయవాడకు భారీ వర్ష సూచన

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాను ప్రభావంతో మంగళవారం విజయవాడలో 162 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షం కురిసే అవకాశం ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వీఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప నగర ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు తెరవవద్దని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మెడికల్ షాపులు, కూరగాయలు, పాల విక్రయ దుకాణాలు తెరుచుకోవచ్చని అధికారులు తెలిపారు.

మంగళవారం రోడ్లపై రాకపోకలు తగ్గించుకోవాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. వాకింగ్?కి, పార్కులకి ప్రజలు వెళ్లొద్దని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్, వీఎంసీ ప్రధాన కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఎన్టీఆర్ జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్: 9154970454, వీఎంసీ కంట్రోల్ రూము: 0866 2424172?, 0866 2422515?, 0866 2427485? ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు. మొంథా తుపాన్ నేపథ్యంలో విజయవాడ నగర పాలక



సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలకు వరద, ముంపు సమస్య, కొండ చెరియలు విరిగిపడే అవకాశం ఉంటుందన్న అంచనాలతో పునరావాస కేంద్రాలను సైతం సిద్ధం చేశారు. ముంపు సమస్య లేకుండా నీటిని తోడేందుకు ట్యాంకర్లు, జేసీబీలను ఏర్పాటు చేశారు.

తరుముకొస్తున్న తుపాను గండం : మరోవైపు రాష్ట్రంలో 'మొంథా' తుపాను గండం తరుముకొస్తోంది. నైరుతి, ఆగ్నేయ మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన మొంథా తుపాను గడిచిన 6 గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తోంది. విశాఖకు 560 కిలోమీటర్ల దూరంలో, కాకినాడకు 530 కిలోమీటర్ల దూరంలో పయనిస్తోంది. చెన్నైకు 480 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ వాయవ్యంగా కదులుతూ రేపు ఉదయానికి తీవ్ర తుపానుగా మారే అవకాశముంది. రేపు రాత్రికి కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశముందని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. మచిలీపట్నం–కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందంటున్నారు. తీరం దాటే సమయంలో తీరం వెంబడి గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తుపాను ప్రభావంతో కాకినాడ పరిసర సముద్రంలో మీటరు ఎత్తున సముద్ర అలలు ఎగసిపడతాయని అంచనా వేస్తున్నారు. తుపాను కారణంగా నేడు భారీ నుంచి అతి భారీ వర్షం, ఒకట్రెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు. తుపాను తీరం దగ్గరకు వచ్చే కొద్దీ మరింత ప్రభావం ఉంటుందని వాతావారణ విభాగం అధికారులు చెప్తున్నారు. 8 జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు : మరోవైపు వచ్చే 24 గంటల్లో 8 జిల్లాలకు ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలు విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నట్లు తెలిపింది.

అలసత్వం వహించేవారిపై కఠిన చర్యలు : తుపాను వేళ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ప్రజల్ని రక్షించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం వహించేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే తుపాను పరిస్థితులు, చేపట్టాల్సిన సహాయక చర్యలపై %=+ా% కేంద్రంలో మంత్రి లోకేశ్, హోం మంత్రి అనితతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సమాచార పంపిణీ వ్యవస్థకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు శాటిలైట్ ఫోన్లు వినియోగించాలని సూచించారు.

ఇందుకు మొబైల్ టవర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే 2,707 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. 110 మండలాల్లోని సచివాలయాల్లో 3 వేల 211 జనరేటర్లను పవర్ బ్యాకప్ కోసం వినియోగించాలని నిర్దేశించారు. సముద్ర తీరంలోని ప్రజల్ని పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కరవును ఎదుర్కొన్నట్లే తుపాన్లను ఎదుర్కొనేందుకూ పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు జరపాలని సీఎం స్పష్టం చేశారు.

## శ్రీశైలం దేవస్థానంలో కార్తీకమాసోత్సవాలకు విశేష స్పందన





- వేకువజాము నుంచే భక్తుల రద్దీ - దర్శన, సదుపాయాలపై ప్రత్యేక ఏర్పాట్లు

**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్) :** పుణ్యమయమైన కార్తీకమాసం ప్రారంభమవడంతో శ్రీశైలక్షేత్రం భక్తజనసంద్రమైంది. కార్తీకమాసంలోని తొలి సోమవారం సందర్భంగా వేకువజామునుంచే వేలాదిమంది భక్తులు శ్రీస్వామి అమ్మవార్ల దర్శనార్థం ఆలయాన్ని చేరుకున్నారు. భక్తులు పాతాళగంగలో పవిత్రస్నానాలు ఆచరించి, భక్తిశ్రద్ధలతో ఆలయ దర్శనాలు చేస్తున్నారు.

కార్తీకమాసంలో ప్రభుత్వ సెలవుదినాలు, సోమవారాలు, పౌర్ణమి వంటి రోజులలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని. అందుకే భక్తులు సౌకర్యంగా దర్శించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

**దర్శన సమయాలు:** వేకువజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రాతఃకాల సేవలు నిర్వహిస్తారు. ఉదయం 4.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుండి రాత్రి 10.30 వరకు భక్తులకు దర్శనాలు కొనసాగుతాయి. కార్తీకమాస రద్దీ రోజుల్లో (శని, ఆదివారాలు, సోమవారాలు, శుద్ధ ఏకాదశి, కార్తీక పౌర్ణమి మొదలైన మొత్తం 16 రోజులు) స్వామివారి స్పర్శదర్శనం మరియు సామూహిక ఆర్జిత అభిషేకాలు పూర్తిగా నిలిపివేయబడ్డాయి అని అధికారులు తెలిపారు.

**సిబ్బందికి ప్రత్యేక విధులు:** భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు అందించేందుకు శాఖాధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. దాదాపు మొత్తం కార్యాలయ సిబ్బంది కార్తీకమాసంలో ప్రత్యేక విధులను నిర్వర్తిస్తున్నారు.

**భక్తులకు సేవలు:** క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు నిరంతరం అల్పాహారం, మంచినీరు అందజేస్తున్నారు. భక్తులు కార్తీక దీపారాధన చేసుకునేందుకు ఆలయ ఉత్తర మాడవీధి మరియు గంగాధర మండపం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**అన్నప్రసాదం, లడ్డు పంపిణీ:** అన్నదాన భవనంలో ఉదయం 10.30 గంటల నుండి అన్నప్రసాదం వితరణ జరుగుతుంది. సాయంత్రం 6.30 గంటల నుండి భక్తులకు అల్పాహారం కూడా అందిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పెద్ద ఎత్తున లడ్డు ప్రసాదాలు సిద్ధం చేయబడ్డాయి. మొత్తం 10 కౌంటర్ల ద్వారా లడ్డు ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు. కార్తీకమాసమంతా శ్రీశైలక్షేత్రం భక్తి తరంగాలతో నిండిపోనుందని దేవస్థానం అధికారులు తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467